సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 21 హైదరాబాద్
శుక్రవారం 26 మే 2023 రూ.15-00
5 జీఖఅదహ్ 1444 హిజ్రీ


**తొలిగీటు**

'మనిషి అసలు ఇష్టపడని విషయాలు రెండు. ఒకటి, మృత్యువు. చావంటే మనిషికి ఇష్టం ఉండదు. నిజానికి మృత్యువు ఉపద్రవం కంటే మేలైనది. రెండవది, పేదరికం. ఈ సంపద లేమిని మనిషి ఇష్టపడడు. కాని సంపద లేమి పరలోకంలో లెక్కను చాలా తేలిక చేస్తుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


**కథ**



10

**విశ్రవీగకు మరణం పొంచి ఉంది**

## లోపల...


| | |
|---|---|
| విద్వేషం ...... | 04 |
| ఇది కన్నడ కథ ...... | 05 |
| జమాఅతె ఇస్లామీ హింద్ నూతన సలహా మండలి సభ్యులు ...... | 09 |
| సంస్కరణలకు పునాది వేసిన సర్ సయ్యద్ ...... | 12 |
| ఇంక్విలాబ్ జిందాబాద్ ...... | 14 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| సామ్రాజ్యానికి సవాల్ ...... | 20 |
| బహిరంగ శత్రువు షైతాన్ ..... | 22 |
| నీటి యుద్ధాల కాలం రాబోతోంది ...... | 24 |
| మార్కెట్ మాయాజాలంలో ముసలితనం ...... | 28 |
| ఔషధరంగం ప్రక్షాళన అవసరమా! ..... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| మరణం ..... | 34 |


### రక్తి కట్టిన కర్నాటకం...




(సీఎంగా సిద్దరామయ్య, డిప్యూటీగా శివకుమార్ )

కొలిక్కి వచ్చిందట
కన్నడ పంచాయితీ
సంతృప్తిగ శివుడికి
ఇచ్చారట రాయితీ!
ఏరికోరి వేశారోయ్
ప్రజలు మీకు ఓట్లు
మీరుమీరు కొట్లాడి
తినకండోయ్ తిట్లు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## విద్వేషం

**మహారాష్ట్రంలోని** జలగాంవ్ పట్టణంలో వివిధ సంఘాలు మత సామరస్యం కోసం ఒక్కటయ్యాయి. ఇటీవల జలగాంవ్‌లో హిందూ జానజాగృతి సమితి నిర్వహించిన ఒక కార్యక్రమంలో వక్తలు ముస్లిం విద్వేష ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 30వ తేదీన జరిగింది. ఆ కార్యక్రమంలో ముస్లిములను ఆర్థికంగా బాయ్ కాట్ చేయాలని పిలుపునివ్వడమే కాదు హింసా కాండను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఈ ప్రసంగాలను వ్యతిరే కిస్తూ వివిధ సంఘాలు పోలీసు సూపరిండెంటును కలిసి వినతి పత్రం సమర్పించాయి. ఈ కార్యక్రమంలో విద్వేష ప్రసంగాలు చేసినవారిపై కేసులు నమోదు చేయాలని కోరాయి. విద్వేష ప్రసంగాలపై పోలీసులు చర్య తీసుకోకపోవడం వల్ల సమాజంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని అన్నారు. మే 10వ తేదీన సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ కూడా ఈ విద్వేష వక్తలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేసింది.

దేశంలో ఇప్పుడు ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయంటే సారే జహాంసే అచ్ఛా గేయాన్ని రాసిన ఇక్బాల్ మహాకవి రాసిన మరో పిల్లల గేయం ఉంది. లబ్ పే ఆతీ హై దువా అనే ఈ గేయంలో ఎంతో చక్కని సందేశం పిల్లలకు ఉంది. జీవితం ఒక దీపంలా ఉండాలని, ప్రపంచానికి తాను వెలుగుగా మారాలని, తన వల్ల తన దేశానికి శోభ కలుగాలని, దీపం చుట్టు తిరిగే దీపపు పురుగులా జ్ఞానకాంతి చుట్టు తాను తిరగాలని, పేదసాదలను సహాయపడే పని తాను చేయాలని, దైవం తనను చెడుల నుంచి కాపాడాలని, సన్మార్గాన నడిపించాలని ఒక పిల్లవాడు చేసే ప్రార్థన ఆ గేయం. గతంలో ఈ గేయం హిందీ ఉర్దూ చదివే విద్యార్థులందరికి తెలిసిన గేయమే. ఈ గేయం పిల్లలతో చదివించినందుకు ఉత్తరప్రదేశ్ బరేలీలో ఒక ఉపాధ్యాయుడి ఉద్యోగం ఊడింది. పదిరోజుల పాటు జైల్లో గడపవలసి వచ్చింది. ఎందుకంటే విశ్వహిందూ పరిషద్ ఆ ఉపాధ్యాయుడిపై కేసు పెట్టింది కాబట్టి. పోలీసులు ఆ కేసును చాలా సీరియస్ గా తీసుకుని విచారణ చేయాలి కాబట్టి. హత్రస్ లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఒక ప్రయివేటు స్కూలు వద్ద తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పిల్లలతో నమాజు చదివిస్తున్నారని ఆరోపించారు. కాని స్కూలు ఈ ఆరోపణలు నిరాకరిస్తూ, పిల్లలతో ఇక్బాల్ గేయం చదివించామని చెప్పింది. అది కూడా వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో. అయినా ఆందోళనకారులు వినలేదు. ప్రిన్సిపాల్తో సహా ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు.

1902లో ఇక్బాల్ ఈ గేయాన్ని రాశారు. బచ్చోంకి దువా పేరుతో ఈ గేయం ప్రసిద్ధ గేయం. చాలా స్కూళ్ళలో దీన్ని చదివించేవారు. ఎన్సీయీఆర్టీ సిలబసులో కూడా ఈ గేయం ఉంది. 2019లో ఫిలిబిత్ లో సిలబసులో ఉన్న ఈ గేయాన్ని చదివించినందుకు ఒక ప్రయిమరీ స్కూలు హెడ్ మాస్టరుపై విశ్వహిందూ పరిషద్ విరుచుకుపడింది. అతన్ని సస్పెండ్ చేశారు. ఒక అద్భుతమైన భావం ఉన్న గేయం, ఒక ఉర్దూ మహాకవి ముస్లిం కవి రాసిన గేయం అయినందువల్లనే, మతరాజకీయాల్లో పావుగా మారిందన్నది స్పష్టం.

ఈ నేపథ్యంలో ఇటీవల అమెరికా నుంచి అంతర్జాతీయ మత స్వేచ్ఛ నివేదిక వచ్చింది. భారతదేశంలో మతమైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, మూకహత్యలు, మూకదాడులు, బెదిరింపులు, బాయ్ కాట్లు జరుగుతున్నాయని, గోరక్షణ పేరుతో మతమార్పిళ్ళ పేరుతో దాడులకు పాల్పడుతున్నారని ఈ నివేదిక తెలిపింది.

మత మైనారిటీలపై జరుగుతున్న దాడుల గురించి ఈ నివేదిక అనేక విషయాలను ప్రస్తావించింది. బుల్డోజర్లతో ఇండ్లను దుకాణాలను కూలగొట్టడం, మతమార్పిళ్ళ పేరుతో అరెస్టులు, హిజాబ్ నిషేధం, విద్వేష ప్రసంగాలు అన్నింటినీ ప్రస్తావించింది. ఈ నివేదికలో యతి నర్సింగానంద సరస్వతి చేసిన విద్వేష ప్రసంగాల ప్రస్తావన కూడా ఉంది. ముస్లిములపై హింసాకాండను రెచ్చగొట్టే ఈ ప్రసంగాలను గురించి ఇందులో పేర్కొన్నారు.

అమెరికా నుంచి వచ్చిన నివేదికకు మనం ప్రాముఖ్యం ఇవ్వక పోవచ్చు. అమెరికన్లు చెప్పే ప్రతి మాటను మనం నమ్మవలసిన అవసరం కూడా లేదు. కాని కంటి ముందు కనిపిస్తున్న వాస్తవాలను ఎలా కాదనగలం? హిజాబ్ బ్యాన్ పేరుతో కర్నాటకలో ముస్లిం విద్యార్థినులను వేధించింది నిజం కాదా? మూకదాడులు జరుగుతున్నది నిజం కాదా? బుల్డోజర్లు ఎవరి ఇండ్లపై ఎవరి దుకాణాలపై ప్రయోగిస్తున్నారు? ఎన్నో సత్యాలు మన కళ్ళ ముందే కనిపిస్తున్నాయి. వాటిని ఎలా కాదనగలం?

దేశంలో దట్టంగా కమ్ముకుంటున్న ఈ మతతత్వ మబ్బులు ఎలాంటి విద్వేష చినుకులకు, తుఫానులకు కారణమవుతాయో సమాజ శ్రేయోభిలాషులందరూ ఆలోచించాలి.

**కవరు కథనం** | **అబ్దుల్ వాహెద్**



# ఇది కన్నడ కథ

**కర్నాటకలో కేరళ స్టోరీ ఆడలేదు. బీజేపీకి కర్నాటక కొత్త కథ చూపించింది.**

కర్నాకలో మతత్వ రాజకీయాలు అడ్డుఅదుపు లేకుండా సాగాయి. గోరక్షణ పేరుతో ముస్లిములపై దాడులు జరిగాయి. హిజాబ్, హలాల్ వివాదాలు రేకెత్తించారు. పాలక బీజేపీ నేతలు బాహాటంగా మతోన్మాద వ్యాఖ్యలు చేశారు. కర్నాటక ఎన్నికల్లో ఈ ఎత్తులేవీ పారలేదు. గత అసెంబ్లీలో 7 గురు ముస్లిం సభ్యులు ఉండేవారు. ఈసారి ముస్లిం సభ్యుల సంఖ్య 9కి పెరిగింది.

ఈ తొమ్మిది మంది ముస్లిములు కాంగ్రెసు నుంచే ఎన్నికయ్యారు. మొత్తం 15 మంది ముస్లింలకు కాంగ్రెసు పార్టీ టిక్కెట్లు ఇచ్చింది. మాజీ ప్రధాని దేవెగౌడ పార్టీ 22 మంది ముస్లిములకు టిక్కెట్లు ఇచ్చింది. కాని వారెవ్వరూ గెలవలేదు. బీజేపీ ఒక్క ముస్లిముకు కూడా టిక్కెట్టు ఇవ్వలేదు. కర్నాటకలో దాదాపు 13 శాతం ముస్లిములున్నారు. కర్నాటక అసెంబ్లీలో 224 స్థానాలున్నాయి. అందులో కనీసం 65 స్థానాల్లో ముస్లిం ఓట్లు కీలకం. ఈ 65 స్థానాల్లో దాదాపు సగం స్థానాలను ఇప్పుడు కాంగ్రెసు గెలుచుకుంది. దాదాపు 88 శాతం ముస్లిం ఓట్లు కాంగ్రెసు పక్షాన పోలయ్యాయనరి విశ్లేషకుల అభిప్రాయం. కాంగ్రెసు పార్టీ నుంచి గెలిచిన 9 మంది ముస్లిముల్లో 7 గురు బీజేపీ అభ్యర్థులను ఓడించి గెలుపు నమోదు చేసుకున్నారు. ఇద్దరు జనతాదళ్ అభ్యర్థులపై గెలిచారు. బెంగుళూరులోని చామరాజపేటలో కాంగ్రెసు తరపున పోటీ చేసిన జమీర్ ఖాన్ తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన భాస్కరరావును 50వేల భారీ మెజారిటీతో ఓడించారు. ఆసక్తికరమైన మరో విషయమేమిటంటే, కాంగ్రెసు నుంచి పోటీ చేసిన ఒకే ఒక్క ముస్లిం మహిళ కనీజ్ ఫాతిమా విజయం నమోదు చేశారు. కర్నాటక కాలేజీల్లో హిజాబ్ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ భారీ నిరసన ర్యాలీలు నిర్వహించిన మహిళగా

కనీజ్ ఫాతిమాకు పేరుంది. కాగా, హిజాబ్ బ్యాన్ విధించిన బీజేపీ నేత, బొమ్మై కేబినేటులో విద్యామంత్రి బి.సి. నాగేష్ తిప్టూర్ నియోజకవర్గంలో ఓడిపోయాడు.

రాష్ట్రంలో విద్వేషరాజకీయాలను నడిపి, ముస్లిం, క్రయిస్తవ మైనారిటీలపై విషం కక్కిన మతతత్వ రాజకీయాలకు కన్నడ ప్రజలు తగిన జవాబు చెప్పారని చాలా మంది విశ్లేషిస్తున్నారు. కాలేజీల్లో హిజాబ్ నిషేధం విధించారు. హిజాబ్ ధరించిన ముస్లిం విద్యార్థినులను వేధించారు. మరోవైపు హిందూత్వ గ్రూపులు హలాల్ ఉత్పత్తులకు వ్యతిరేకంగా గగ్గోలు చేయడం, ముస్లిములను బాయ్‌కాట్ చేయాలంటూ హంగామా చేయడం కొనసాగింది. గుడుల వద్ద ముస్లిం వ్యాపారులెవ్వరు దుకాణాలు పెట్టరాదని నిషేధాలు విధించారు. మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులపై కూడా దాడులు జరిగాయి. గోరక్షణ పేరుతో, మతమార్పిడీల నిషేధం పేరుతో ప్రభుత్వం చట్టాలు తీసుకు వచ్చింది... చివరకు ప్రధానితో సహా బీజేపీ నాయకులు కర్నాటక ఎన్నికల్లో కేరళస్టోరీ సినిమాను కూడా వాడుకున్నారు. అబద్ధాలు ప్రచారం చేసిన ఈ సినిమా తమకు ఓట్లు కురిపిస్తుందనుకున్నారు.

బీజేపీ ముస్లిం వ్యతిరేక విధానాలు ముస్లిములను కాంగ్రెసు వైపు మొగ్గు చూపేలా చేశాయి. కర్నాటకలో పోటీ చేసిన మజ్లిస్ పార్టీ ఒక్క విజయం కూడా నమోదు చేయకపోవడం గమనించదగిన విషయం. సెక్యులర్ డిమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కూడా ఒక్క గెలుపు సాధించలేకపోయింది. ముస్లింల పేరుతో రాజకీయాల్లో పోటీ చేస్తున్న పార్టీల వైపు కూడా ముస్లిములు చూడలేదు. ముస్లిము ఓట్లన్నీ కాంగ్రెసు వైపునకు మళ్ళాయి. ముస్లిములు రాజకీయ చైతన్యంతో ఓటు వేస్తున్నారన్నది దీని వల్ల స్పష్టమయ్యింది. ఇది సెక్యులర్ పార్టీలకు శుభసూచకం.

పాత మైసూరు ప్రాంతంలో మాజీ ప్రధాని దేవెగౌడ పార్టీకి చాలా బలం ఉంది. అయినప్పటికీ అక్కడ కూడా జనతాదళ్ సెక్యులర్ నిలబెట్టిన ముస్లిం అభ్యర్థులు ఎవ్వరు గెలవలేదు. ఇక్కడ దాదాపు 11శాతం ముస్లిం జనాభా ఉంది. ఓట్లన్నీ కాంగ్రెసు వైపునకు మరలాయి. వొక్కలిగ, ముస్లిం ఓట్లపై ఇప్పటి వరకు గెలుస్తూ వస్తోంది జనతాదళ్ సెక్యులర్. అంతేకాదు హిజాబ్ బ్యాన్‌ను వ్యతిరేకిస్తూ బహిరంగంగా ప్రకటనలు చేసిన పార్టీ కూడా జనతాదళ్ సెక్యులర్ మాత్రమే. అయినప్పటికీ పాత మైసూరు ప్రాంతంలో వొక్కలిగ ఓట్లతో పాటు ముస్లిం ఓట్లు కూడా కాంగ్రెసు ఖాతాలోకి వెళ్ళాయి. ఎన్నికల తర్వాత జనతాదళ్ సెక్యులర్ మరలా బీజేపీతో చేతులు కలుపవచ్చనే భయాలే దీనికి కారణం. ఇదే భారత రాజకీయాల్లో ఇటీవల జరుగుతూ వస్తోంది. చిన్న చిన్న పార్టీలకు వలేసి తమవైపు తిప్పుకుని, పార్టీ అభ్యర్థులకు ప్రలోభాలు చూపించి ప్రభుత్వాన్ని కూల్చడం ఇటీవల భారత రాజకీయాల్లో మామూలయ్యింది. ఈ పరిస్థితి రాకుండా ముస్లిములు వ్యూహాత్మకంగా ఓటు వేశారన్నది స్పష్టంగా తెలుస్తోంది. జనతాదళ్ సెక్యులర్ బహిరంగంగా హిజాబ్ బ్యాన్‌ను వ్యతిరేకించిందన్నది నిజమే. కాని జనతాళ్ సెక్యులర్ నుంచి చాలా మంది బీజేపీలోకి ఇటీవల పార్టీ ఫిరా యించారన్నది కూడా అంతే నిజం. అందువల్లనే 2019లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. ఈ రాజకీయాలను వొక్కలిగ ఓటర్లు, ముస్లిం ఓటర్లు చూశారు.

కర్నాటక కోస్తా ప్రాంతాల్లో బీజేపీ చాలా బలంగా ఉందనేది నిన్నటి మాట. అక్కడ మొత్తం 19 స్థానాలున్నాయి. 2018లో అక్కడ 16 స్థానాలు బీజేపీ గెలిచింది. ఇప్పుడు 12 స్థానాలకు పడిపోయింది. బీజేపీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ప్రభుత్వం




ముస్లిం వ్యతిరేక విధానాలకు చిరునామాగా పేరు సంపాదించు కుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించరాదని నిషేధం విధించిన మంత్రి, ముస్లిం వ్యాపారులను బాయ్ కాట్ చేయాలని పిలుపునిచ్చిన బీజేపీ మంత్రి బి.సి. నాగేష్ ఓడిపోయాడు. హిజాబ్ బ్యాన్‌ను వ్యతిరేకించి నిరసనలు భారీ స్థాయిలో నిర్వహించిన కాంగ్రెసు అభ్యర్థి కనీజ్ ఫాతిమా గెలిచింది. ఆమెను ఓడించడానికి, ముస్లిం ఓట్లను చీల్చడానికి తొమ్మిది మంది ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపారు. అయినప్పటికీ ఆమె కాంగ్రెసు తరపున గెలిచింది.

2022లో బీజేపీ ప్రభుత్వం మతమార్పిళ్ళపై చట్టం చేసింది. పశువుల రవాణాపై చట్టం చేసింది. రాష్ట్రంలో హలాల్ మాంసాన్ని నిషేధించాలని కూడా కొందరు బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. అలాగే ముస్లిములకు 4శాతం రిజర్వేషన్లు రద్దు నిర్ణయం బీజేపీ కొంప ముంచిందని కూడా చాలా మంది విశ్లేషిస్తున్నారు. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్ళింది. అక్కడ బొమ్మై ప్రభుత్వం రద్దు నిర్ణయాన్ని అమలుచేయడం లేదని చెప్పుకుంది. కాంగ్రెసు పార్టీ ఈ అవకాశాన్ని వదల్లేదు. 4 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. అంతేకాదు పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, భజరంగ్ దళ్ సంస్థలను నిషేధిస్తామని కాంగ్రెసు చెప్పింది. నిజానికి పాప్యులర్ ఫ్రంట్ పై ఇప్పటికే నిషేధం ఉంది. కాని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెసు చెప్పడంతో బీజేపీ మండిపడింది. హిందూ ఓటర్లను ఆకట్టుకోడానికి ప్రధాని మోడీ స్వయంగా హిందువులకు పిలుపునిస్తూ జై భజరంగ్ దళ్ అంటూ ఓటు వేయాలని చెప్పారు.

భజరంగ్ దళ్ నిషేధం గురించి మానిఫెస్టోలో చేర్చడం బాగా ఆలోచించిన తర్వాతే కాంగ్రెసు పార్టీ తీసుకున్న చర్యగా తెలుస్తోంది. ఎందుకంటే, కర్నాటకలో బీజేపీ మతతత్వ రాజకీయాలు 2018లోనే పరాకాష్ఠకు చేరుకున్నాయి. అప్పుడు సాధించిన ఓట్లు కూడా పూర్తి మెజారిటీ ఇవ్వలేదు. కన్నడ ప్రజలు మతతత్వ రాజకీయాలతో విసిగిపోయారు. అందువల్ల భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని హామీ ఇవ్వడం వల్ల కన్నడలో హిందువులు రెచ్చిపోయి కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు వేస్తారనే బీజేపి లెక్కలు తప్పాయి. హిజాబ్, హలాల్, లవ్ జిహాద్ అంటూ రాజకీయాలు చేస్తున్నవారికి గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కాదు కాదు ప్రజల మధ్య విభేదాలను రెచ్చగొట్టడమే బీజేపీ పని అన్నది ఇటీవల మరింత స్పష్టంగా అర్థమయ్యింది. కర్నాటకలో బీజేపీ కార్యకర్తల కోసం జనవరిలో జరిగిన 'బూత్ విజయ్ అభియాన్' అనే కార్యక్రమంలో ఆ పార్టీ కర్నాటక అధ్యక్షుడు నళిన్ కతీల్ మాట్లాడుతూ, ప్రజలు ఊరికే రోడ్లు బాగాలేవు, మురికి కాలువలు బాగాలేవు, తదితర చిన్న చిన్న సమస్యల గురించిమాట్లాడొద్దన్నాడు. లవ్ జిహాద్ గురించి ఆలోచించాలని, 'లవ్ జిహాద్'ని ఆపాలనుకుంటే, మీకు బిజెపి అవసరం. లవ్ జిహాద్‌ను వదిలించుకోవడానికి, మీకు బిజెపి అవసరం అని చెప్పాడు. కర్నాటకలో 78.93 లక్షల మంది ముస్లిములున్నారు. 11.43 లక్షల మంది క్రయిస్తవులున్నారు. మరోవైపు షెడ్యుల్డ్ కులాలు, తరగతుల ప్రజలు కూడా హిందూత్వ రాజకీయాల పట్ల వ్యతిరేకత ప్రదర్శించడం ప్రారంభమయ్యింది.

కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఆలోచించవలసిన చాలా ప్రశ్నలున్నాయి. కర్నాటక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ భజరంగ్ దళ్‌పై నిషేధం విధిస్తానన్న కాంగ్రెసుపై తీవ్రదాడి చేశారు. కాంగ్రెసు పార్టీ కర్నాటక రాష్ట్రాన్ని దేశం నుంచి విడగొట్టాలని చూస్తోందన్నారు. ఇప్పుడు మనం ఆలోచించవలసిన ప్రశ్న ఏమిటంటే, కర్నాటక రాష్ట్రాన్ని దేశం నుంచి విడగొట్టాలని కాంగ్రెసు చూస్తుంటే, కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోంది. ఎందుకు ఈ కుట్రపై అరెస్టులు జరగలేదు. ఇది దేశద్రోహం కిందికి రాదా? ప్రధాని మోడీ చెప్పినట్లు కాంగ్రెసు కర్నాటక రాష్ట్రాన్ని దేశం నుంచి విడగొట్టాలని చూస్తుందని కన్నడ ప్రజలు ఎంత మంది నమ్ముతున్నారు? అసలు ప్రధాని మోడీ స్వయంగా ఈ మాటలను నమ్ముతున్నారా? లేక కేవలం చునావీ జుమ్లాలు చెబుతున్నారా? ప్రజాస్వామ్యంలో ఓట్లు పొందడానికి రాజకీయ నాయకులు ఏమేమో చెబుతారు, నిజమే కాని ఒక ప్రధాని ఇలాంటి తీవ్రమైన ఆరోపణ చేయడం ఎంత వరకు సబబు?

కర్నాటకలో బీజేపీ పార్టీకి పునాదులేసి నిలబెట్టిన నాయకులు బి.యస్. యడ్యురప్ప, జగదీష్ షెట్టర్. ఈ ఇద్దరు నేతలను ఈసారి ఎన్నికల్లో పక్కన పెట్టేయబడ్డారు. హిజాబ్ బ్యాన్, లవ్ జిహాద్ తదితర మతతత్వ వ్యవహారాలను యడ్యురప్ప సమర్థించడం లేదన్నది ఆయన అనేకసార్లు చేసిన వ్యాఖ్యల్లో తెలుస్తోంది. ఆయనకు కర్నాటక నాడి తెలుసు. ప్రజల సమస్యలపై దృష్టిపెట్టాలని ఆయనకు తెలుసు. కాని కర్నాటకలో హిందూత్వ రాజకీయాలు దూకుడు పెంచే యువనేతలను పార్టీ రంగంలోకి దింపింది. ఉత్తరాది రాజకీయాల్లో పని చేసిన మతతత్వం ఇక్కడ కూడా ఓట్ల వాన కురిపిస్తుందని భావించారు.

దేశంలో గ్యాస్ సిలిండర్ ధర ఆకాశానికి చేరుకుంది. నిరుద్యోగం 6 శాతానికి 2018లోనే వెళ్ళిపోయింది. కాని ఈ విషయాలేవి మన టీవీల్లో చర్చకు రావు. దీనిపై వ్యాసాలు మన పత్రికల్లోరావు. వాట్సప్ గ్రూపుల్లో ఈ చర్చ జరగదు. కేరళస్టోరీ, హిజాబ్ కేసు, హలాల్ నిషేధం వంటివే మన మీడియాలో ప్రముఖంగా

కనిపిస్తాయి. మీడియా పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కర్నాటక ప్రజలు తమ తీర్పు ఏమిటో చెప్పారు. చాలా స్పష్టంగా చెప్పారు.

కర్నాటక ఓటమి తర్వాత బీజేపీ బహుశా ముస్లిం విద్వేష రాజకీయాలను తగ్గిస్తుందని కొందరు ఆశపడుతున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కొత్తపద్ధతుల్లో ప్రచారం జరగవచ్చని భావిస్తున్నారు. నిజానికి ముస్లిం విద్వేష రాజకీయాలే బీజేపీకి ప్రాణం. 2014 నుంచి పార్టీ బలం పెరగడానికి ఈ రాజకీయాలే కారణం. కర్నాటకలో బీజేపీ బలపడడానికి కూడా ఈ రాజకీయాలే కారణమని బీజేపీ నేతలు విశ్వసిస్తూ వచ్చారు. ఇప్పుడు కర్నా టకలో ఎదురుదెబ్బ తగిలింది. కాని జాతీయస్థాయిలో ముస్లిం విద్వేష రాజకీయాల నుంచి బీజేపీ వెనక్కి తగ్గే అవకాశాలు లేవు. ఎందుకంటే బీజేపీ వద్ద చెప్పుకోడానికి మరేమీ లేదు.

ప్రపంచ ఆకలి సూచి 2020 ప్రకారం 107 దేశాల జాబితాలో భారతదేశం 94వ స్థానంలో ఉంది. అఫ్ఘనిస్తాన్ 99వ స్థానంలో ఉంటే, మయన్మార్ 78వ స్థానంలో ఉంది. సంక్షోభంతో సతమతమైన శ్రీలంక 64వ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ 75వ స్థానంలో ఉంది. నేపాల్ 73వ స్థానంలో ఉంది. చివరకు పాకిస్తాన్ కూడా 88వ స్థానంలో ఉంది.

నిరుద్యోగం పరిస్థితి చూస్తే ఫిబ్రవరి 2023లో నిరుద్యోగ రేటు 7.45 శాతానికి పెరిగింది. దేశంలో 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారిలో 24.9 శాతం నిరుద్యోగులని తెలుస్తోంది. ఇది దక్షిణాసియాలోనే అత్యధికం.

పిల్లల్లో ఎదుగుదల స్తంభించడం అనేది పోషకాహార లోపం వల్ల జరుగుతుంది. దేశంలో 17.3 శాతం పిల్లలు ఎదుగుదల స్తంభించిన (Stunt) పిల్లలున్నారు. దక్షిణాఫ్రికాలో ఇది చాలా ఎక్కువ శాతం. దేశంలో ఆత్మహత్యల రేటు కూడా ఎక్కువగా ఉంది. లక్ష జనాభాకు దేశంలో 12 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రపంచ సంతోష సూచిలో 137 దేశాల జాబితాలో భారతదేశం 126వ స్థానంలో ఉంది. అన్నింటికన్నా చిట్టచివరన ఉన్న దేశం అఫ్ఘనిస్తాన్ 137వ ర్యాంకు. దక్షిణాసియాలో మిగిలిన దేశాలను చూస్తే బంగ్లాదేశ్ ర్యాంకు 118, పాకిస్తాన్ ర్యాంకు 108, శ్రీలంక ర్యాంకు 112.

ఈ సూచిలను రూపొందించినవారు భారతదేశం పట్ల వ్యతిరేకత వల్ల ఇలాంటి ర్యాంకులు ఇచ్చారని అనుకున్నా అనుకోవచ్చు, కాని భారత ఆర్థికవ్యవస్థ పరిస్థితి బాగోలేదన్న వాస్తవం రోజు పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఉపాధిలేమి వంటి సమస్యలతో మనకు అర్థమవుతూనే ఉంది. ఈ సమస్యల పరిష్కారానికి బీజేపీ వద్ద ఎలాంటి మంత్రదండమూ లేదు.

ఈ నేపథ్యంలో బీజేపీ వద్ద ఉన్న ఒకే ఒక్క ఆయుధం హిందూత్వ రాజకీయాలను మరింత దూకుడుగా నడపడం. బహుశా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెసు విజయాన్ని కూడా ఒక సాధనంగా వాడుకోవచ్చు. ఇటీవల కాంగ్రెసు గెలిచిన తర్వాత ఒక వైరల్ వీడియోలో ఆకుపచ్చ జెండాను చూపిస్తూ ఫేక్ ప్రచారం చేశారు. ఇలాంటి ఫేక్ ప్రచారాలు మరిన్ని ముందుకు రావచ్చు. 2024లో ఉత్తరాదిలో బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోడానికి మతతత్వ రాజకీయాల దూకుడు పెంచవచ్చని చాలా మంది విశ్లేషిస్తున్నారు.

అయితే కర్నాటక కాంగ్రెసు విజయం ప్రతిపక్షాల ఐక్యతకు, ముఖ్యంగా కాంగ్రెసు పునర్ వైభవానికి మైలురాయి వంటివని కూడా కొందరు భావిస్తున్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ సమీకరణాలను మార్చేస్తాయని చాలా మంది ఆశిస్తున్నారు. ఏం జరుగుతుందో కాలమే చెప్పాలి. ✤

## గీటురాయి వారపత్రిక ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

## కేంద్ర జమాఅతె ఇస్లామీ హింద్ 2023-27 మీఖాత్ కాలానికి

**సెక్రటరీ జనరల్**

**జనాబ్ టీ. ఆరిఫ్ అలీ**

**ఉపాధ్యక్షులు**

- జనాబ్ మలిక్ ముఅతసిమ్ ఖాన్
- జనాబ్ ఇంజనీర్ ముహమ్మద్ సలీమ్
- జనాబ్ యస్. అమీనుల్ హసన్
- మౌలానా వలీవుల్లా సయీదీ ఫలాహీ

# తెలుగు రాష్ట్రాల్లో జమాఅతె ఇస్లామీ హింద్ సలహా మండలి సభ్యులు

2023-2027 కాలానికి గాను జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థాగత ఎన్నికలు ఇటీవల జరిగిన విషయం తెలిసిందే.

జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ నూతన సలహా మండలి సభ్యులుగా ఎన్నికైన వారు :

- జనాబ్ హామిద్ ముహమ్మద్ ఖాన్
- జనాబ్ ఎం.ఏ.రఫీఖ్ హామిద్ లతీఫీ
- జనాబ్ ముహమ్మద్ అబ్దుర్రహ్మాన్ దావూదీ
- జనాబ్ ముహమ్మద్ అబ్దుల్ అజీజ్
- ముహతరమా ఆసియా తస్నీమ్
- జనాబ్ సయ్యిద్ అబ్దుల్ బాసిత్ అన్వర్
- జనాబ్ సయ్యిద్ తన్వీరుల్ హక్
- జనాబ్ ఎం.ఎన్. బేగ్ జాహెద్
- జనాబ్ అహ్మద్ అబ్దుల్ హలీమ్
- జనాబ్ సయ్యిద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
- జనాబ్ ముహమ్మద్ రషాదుద్దీన్
- జనాబ్ ముహమ్మద్ అజ్హరుద్దీన్
- జనాబ్ ఫహీముద్దీన్ అహ్మద్
- ముహతరమా ఖాలిదా పర్వీన్
- జనాబ్ ముహమ్మద్ సాదిక్ అహ్మద్
- జనాబ్ సయ్యిద్ షుజాతుల్లా హుసైనీ
- జనాబ్ ఇక్బాల్ హుసైన్
- జనాబ్ అబ్దుల్ మజీద్ షుఐబ్
- జనాబ్ తారిఖ్ మునీర్

జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ నూతన సలహా మండలి సభ్యులుగా ఎన్నికైన వారు :

- జనాబ్ సయ్యిద్ ఇమ్దాదుల్లా హుస్సేనీ నిజామీ
- జనాబ్ కె.యం.ఎ. సుబ్హాన్
- జనాబ్ ముజాహిద్ ఖాన్ ఉమరీ
- జనాబ్ ముహమ్మద్ కరీముద్దీన్
- జనాబ్ యస్. గౌస్ ముహియుద్దీన్ నిజామీ
- జనాబ్ ముహమ్మద్ జాహిద్
- జనాబ్ షేక్ షకీర్ హుసైన్
- జనాబ్ షేక్ ముహమ్మద్ షరీఫ్
- జనాబ్ సయ్యిద్ షౌకత్ అలీ
- జనాబ్ జె. అబ్దుల్లా ఖాన్
- జనాబ్ ముహమ్మద్ హిమాయతుద్దీన్
- జనాబ్ అబ్దుల్ అలీమ్
- జనాబ్ ముహమ్మద్ అక్బర్ బాషా

## జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర సలహా మండలికి ఎంపికైన సభ్యులు

1. జనాబ్ టీ. ఆరిఫ్ అలీ
2. జనాబ్ ఇంజనీర్ ముహమ్మద్ సలీమ్
3. జనాబ్ ముహమ్మద్ జాఫర్
4. జనాబ్ యస్.క్యూ.ఆర్. ఇల్యాస్
5. మౌలానా రజీవుల్ ఇస్లాం నద్వీ
6. జనాబ్ యస్. అమీనుల్ హసన్
7. జనాబ్ మలిక్ ముఅతసిమ్ ఖాన్
8. జనాబ్ హసన్ రజా
9. జనాబ్ ముజ్తబా ఫారూక్
10. మౌలానా వలీవుల్లా సయీదీ ఫలాహీ
11. జనాబ్ అబ్దుల్ జబ్బార్ సిద్దీకీ
12. జనాబ్ సలీం ఖాన్
13. ముహతరమా రహ్మతున్నీసా
14. జనాబ్ ముహమ్మద్ ఇక్బాల్
15. ముహతరమా అతియా సిద్దీకీ
16. జనాబ్ ముహియుద్దీన్ ఘాజీ
17. జనాబ్ ఎం.ఐ. అబ్దుల్ అజీజ్
18. జనాబ్ సయ్యిద్ తన్వీర్
19. జనాబ్ అబ్దుస్సలామ్
20. జనాబ్ షబ్బీర్ ఆలమ్
21. డా. మలిక్ ఫైసల్ ఫలాహీ
22. జనాబ్ ఏజాజ్ అహ్మద్ అస్లం
23. డా. ఫహీముద్దీన్ అహ్మద్
24. జనాబ్ ముహమ్మద్ తాహా మతీన్

కథ



# విర్రవీగకు మరణం పొంచి ఉంది

**- షేక్ అబ్దుల్ బాసిత్**

**"ఏరా అబ్బాయి!** ఎక్కడికి వెళ్ళుతున్నావు?"

"బజారుకు వెళ్ళుతున్నాను బాబాయ్."

నేను వస్తాను రా.

అలాగే బాబాయ్. రండి.

అధికారం కోసం కుల మతాల పేరుతో దేశంలో రోజు రోజుకు మనుషుల మధ్య విద్వేషం పెంచడం ఎక్కువ అయిపోతుంది రా, అబ్బాయి.

నిజమే బాబాయ్. మూడు నాళ్ళ అధికారం కోసం వీళ్ళు రాజేస్తున్న అగ్ని గుండంలో ఎందరో అమాయకులు బలి అయిపోతున్నారు. మరెందరో అనాథలుగా, వితంతువులుగా నిలువ నీడ లేక విలపిస్తున్నారు.

వీళ్ళందరి ఉసురు తప్పక తగులుతుంది రా వీళ్ళకు.

అవును బాబాయ్. అధికారం శాశ్వతం అని అనుకుంటున్నారు. వీళ్ళ కన్న ముందు ఇలాగే అధికార మదంతో విర్రవీగిన విశ్వ వినాశనానికి ఒడిగట్టిన వారి గతి ఏమైందో అందరికీ తెలిసిందే కదా.

దైవాన్ని మరచి, విశ్వ సామ్రాజ్యానికి అధిపతిగా విర్రవీగిన నమ్రూద్ చక్రవర్తి ఒక చిన్న దోమ, అది కూడా ఒంటి కాలు దోమ బుగ్గ మీద కుడితే చచ్చిపోయాడు.

"నా అంతటి వాడు లేనే లేడు" అని విర్రవీగి ప్రజల మీద దౌర్జన్యం చేసిన ఫిరౌన్ చక్రవర్తి నడి సముద్రంలో ముంచి వేయబడ్డాడు. నేటికీ అతని శవం ఈజిప్టు మ్యూజియంలో సాక్ష్యంగా మనకు కనిపిస్తుంది.

ది గ్రేట్ అలెగ్జాండర్. విశ్వ విజేత. చచ్చిపోయాక నా శవయాత్రలో నా రెండు చేతులు బయటికి కనబడేలా పెట్టండి అని అన్నాడు. ఎందుకంటే దైవం నాకిచ్చిన బలంతో విశ్వ విజేతగా అయితే నిలిచాను కాని, పోయేటప్పుడు వట్టి చేతులతో వెళ్ళుతున్నానని అందరూ తెలుసుకోవాలి అని.

అవును రా అబ్బాయ్. మనకు ఏది లభించినా అది పైవాడి భిక్షనే కదా. వచ్చినప్పుడు తెచ్చింది ఏమి లేదు. పోయేటప్పుడు పట్టుక పోయేది కూడా ఏమీ లేదు. అయిన ఎందుకో ఈ మిడిసిపాటు.

చూడు బాబాయ్, ఈ జీవితం ఒక పరీక్ష. ఇక్కడ ఊహించని రీతిలో కొందరు రాజ్యాలకు రాజులౌతారు. కట్టుబట్టలు లేనివారు లక్షల సూట్లు దరించే వారిగా చేస్తాడు. నిలువ నీడ లేని వాడికి రాజ భవనాల్లో నివసించేలా చేస్తాడు. తింటానికి తిండి లేనివారికి పంచభక్ష్య పరమాన్నాలు ప్రసాదిస్తాడు.

ఇదంతా పొంది విర్రవీగే వారు గుర్తుంచుకోవలసింది ఏమిటంటే. ఈ జీవితం శాశ్వతం కాదు. మరణం తథ్యం. మరణానంతరం ఇక్కడ చేసిన ప్రతి పనికి ఫలితాన్ని అనుభవించక తప్పదు.

ఇక్కడ అధికారాన్ని ఉపయోగించి లక్షలాది మందిని చంపి న్యాయాన్ని తలకిందులుగా చేసి శిక్ష పడకుండా తప్పించుకోవచ్చు.

అమాయకుల మీద దౌర్జన్యం చేయవచ్చు. అన్యాయాలకు, అక్రమాలకు అధర్మాలకు పాలుపడి ప్రపంచంలోనే నంబర్ వన్ ధనవంతులు కావచ్చు. కాని జాగ్రత్త. రేపు మరణించాక దేవుని న్యాయస్థానంలో వంటరిగా హాజరు కావాల్సిందే. అక్కడ ఈ మంది మార్బలం, అధికార దర్పం ఏది పనికి రాదు అని మరచి పోతున్నారు.

నిజమే రా అబ్బాయ్. విశ్వ సామ్రాజ్యానికి అధిపతి అయి కూడా ఒక మామూలు మనిషిగా జీవించిన ప్రవక్త ముహమ్మద్(స), ఆయన అనుచరులు జీవితాలు మనకు ఆదర్శం కావాలి.

అంతెందుకు బాబాయ్ నేటి తరంలో కూడా, బ్రిటిష్ బానిస సంకెళ్లు తెంచిన మహాత్మా గాంధీ, సూటు-బూటు వదలి గోసి గుడ్డ కట్టుకుని జాతిపితగా కీర్తించబడ్డాడు. ముతక బట్టలు ధరించి మథర్ థెరీసా విశ్వమాత కాలేదా. రాష్ట్రపతి గా, మిసైల్ మాన్‌గా, కీర్తించబడిన అబ్దుల్ కలాం ఈ లోకాన్ని వీడి వెళ్ళినప్పుడు వదలి వెళ్ళిన ఆస్తి మనం చూడలేదా. మహనీయులు ఎప్పుడూ నిడారంబరంగానే ఉంటారు. వారే శాశ్వత కీర్తికి అర్హులు.

అధికారం, అందలం శాశ్వతం అని మిడిసిపాటుతో విర్రవీగే వారు. ఆడంబరాలకు పోయేవాడు. సొంత డబ్బా కొట్టుకునే వారు తమను తాము మభ్య పెట్టుకునే వారే మూర్ఖులు.

"బాగా తెలుసు కోండి. ఈ లౌకిక జీవితం ఒక ఆట ఒక వినోదం. బాహ్య పటాటోపం. పరస్పరం ప్రగల్భాలు పలకటం. సంపద సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యత పొందడానికి ప్రయత్నించడం తప్ప మరేమీ కాదు." (56:20)

"స్త్రీలూ సంతానమూ, వెండి, మేలు జాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్య జడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు సూత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే." (3:14)

అని ఖురాన్‌లో తెలిపిన విషయాన్ని కాస్త బుర్ర పెట్టి ఆలోచిస్తే బాగుండేది.

నిజం రా అబ్బాయ్. అల్లాహ్, మనంద రికీ జీవిత మర్మాన్ని తెలుసుకునే బుద్ధిని ప్రసాదించుగాక. ఆమీన్.

## ముస్లిం కోటాపై సుప్రీంకోర్టు మాటలను బీజేపీ నేతలు గౌరవించాలి : కాంగ్రెసు నాయకుడు షబ్బీర్ అలీ

మాజీ మంత్రి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకుడు ముహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముస్లిం కోటా విషయంలో సుప్రీంకోర్టు చెప్పిన మాటలను బీజేపీ నేతలు గౌరవించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని కోరారు. కర్నాటకలో ముస్లిం కోటా రద్దు గురించి బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. ఇక్కడ కూడా అదే వర్తిస్తుందని ముహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికీ బీజేపీ నేతలు నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. బీజేపీ నేతలు, హోం మంత్రి అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, సుప్రీంకోర్టులో ఈ వివాదం విచారణలో ఉన్నప్పటికీ వ్యాఖ్యలు మానడం లేదని షబ్బీర్ అలీ చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే వల్లనే రాష్ట్రంలో ముస్లిం కోటా అమలవుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కోటాపై చేసే ఎలాంటి వ్యాఖ్యలైనా కోర్టు ధిక్కారం కిందికే వస్తాయని ఆయన అన్నారు.


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు – హిందీ – ఇంగ్లీష్ – తమిళం – కన్నడ – మరాఠీ – బెంగాలీ


భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:

**1800 572 3000**

# సంస్కరణలకు పునాది వేసిన సర్ సయ్యద్



**సబా**

**భారతదేశం**లో సంస్కరణల కోసం వినిపించిన మొదటి ముస్లిమ్ స్వరం సర్ సయ్యద్. 1857 తిరుగుబాటు తర్వాత దేశంలో ముస్లిము సముదాయం యావత్తు తీవ్రమైన నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయిన కాలంలో ఆయన ముస్లిముల్లో కొత్త జవజీవాలు నింపాడు. ఒకవైపు 1857 తిరుగుబాటుకు ముఖ్యమైన కారకులుగా ముస్లిములను లక్ష్యం చేసుకుని బ్రిటీషు ప్రభుత్వం అణిచివేతలకు పాల్పడుతున్నప్పుడు తిరుగుబాటుకు కారణాలను అద్భుతంగా వివరిస్తూ పుస్తకం రాసి లండన్ పంపించాడు. బ్రిటీషు ప్రభుత్వ తప్పులను నిర్భయంగా ఎత్తి చూపాడు.

ఆ కాలంలో యావత్తు ముస్లిమ్ సముదాయం ఒక జడత్వంలో కూరుకుపోయింది. మతపెద్దలు తమ మూర్ఖత్వంతో ఆధునిక విద్యాభ్యాసాన్ని వ్యతిరేకిస్తున్న కాలమది. ఆ కాలంలో సర్ సయ్యద్ బ్రిటీషు ప్రభుత్వంలో అత్యున్నత హెూదాలో పనిచేసిన అధికారి. జుడిషియల్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. 1857తిరుగుబాటు, తిరుగుబాటు విఫలం కావడం, ఆ తర్వాత అత్యంత క్రూరంగా, అమానుషంగా బ్రిటీషు ప్రభుత్వం అణిచివేతలకు పూనుకోవడం, ఈ అణిచివేతలు ముఖ్యంగా ముస్లిములే లక్ష్యంగా కొనసాగడం ఆయన చూశాడు. ఈ సంఘటనలు ఆయనపై బలమైన ప్రభావాన్ని వేశాయి. ఈ విషయమై ఆయన ఇలా రాశాడు:

“ముస్లిం సముదాయం దౌర్భాగ్య స్థితిపై చాలా ఆలోచించాను. ముస్లిముల సమస్యలన్నింటికి పరిష్కారం కేవలం ఆధునిక విద్యాభ్యాసం ఒక్కటే అన్న నిర్ణయానికి వచ్చాను. యూరోపియన్ సాహిత్యం, సైన్సులను చదవడం మతానికి వ్యతిరేకం, మత విశ్వాసాలు దానితో అంతరించిపోతాయన్న అభిప్రాయాలను ముస్లిముల మనస్సుల్లో నుంచి తుడిచేయాలనుకుంటున్నాను”.

సర్ సయ్యద్ అక్టోబర్ 17, 1817లో జన్మించారు. విద్యాపరమైన, సామాజికమైన సంస్కరణలు సాధించడమే ఏకైక లక్ష్యంగా అవిశ్రాంతంగా శ్రమించారు. మతవ్యవహారాల్లో తలదూర్చాలన్న ఆసక్తి ఆయనకు ఎంతమాత్రమూ లేదు. కాని ఆయన ప్రారంభించిన సంస్కరణలన్నింటిని మతం పేరుతో, మతానికి విరుద్ధమైనవిగా చెబుతూ వ్యతిరేకించిన వారంతా మతపెద్దలే.

తన పరిస్థితిని వివరిస్తూ సర్ సయ్యద్ స్వయంగా ఇలా రాశారు: “మతానికి సంబంధించిన ఎలాంటి చర్చ లేకుండా ఉండాలని మేం చాలా జాగ్రత్తపడుతూ వస్తున్నాం. కాని సమస్య ఏమిటంటే, మన వైఖరులు, మన సామాజిక ఆచరణలు, మతవిశ్వాసాలు కలగలిసి పోయి ఉన్నాయి. అందువల్ల మతపరమైన వివాదం లేకుండా సామాజిక సంస్కరణ గురించి మాట్లాడడం సాధ్యం కాని పరిస్థితి ఉంది.“మతపెద్దల వైఖరికి విసిగిపోయి, ఏదైనా నష్టదాయకమైన విషయాన్ని వదిలేద్దాం అంటే వాళ్ళు అది మతపరంగా ముఖ్యమైంది అంటారు, ఏదైనా మంచి పని చేద్దామంటే వాళ్ళు అది మతపరంగా నిషిద్ధం అంటారు. కాబట్టి మన ఎజెండా ముందుకు తీసుకెళ్ళాలంటే మతపరమైన నేపథ్యంలోనే చర్చలు చేయక తప్పని పరిస్థితి ఉంది”. అన్నారు.

ఈ లక్ష్యంతోనే ఆయన 1884లో ముహమ్మదన్ సోషల్ రిఫార్మర్ జర్నల్ ప్రారంభించారు. ఆయన మాటల్లో చెప్పాలంటే ముస్లిములను అజ్ఞానపు అఖాతంలోకి నెట్టేసిన మతపరమైన ఛాందసంపై పోరాడ్డానికి ఈ పత్రిక చాలా ఉపయోగపడింది. ఈ పత్రిక విద్యా పరమైన ప్రగతి, సామాజిక, ధార్మిక సంస్కరణలపై దృష్టిపెట్టిన పత్రిక.


అలీగఢ్ స్కూలు 1875లో ప్రారంభమైంది. కేవలం ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో ప్రారంభమైంది. సర్ సయ్యద్ స్వయంగా తన వద్ద ఉన్నదంతా దీనికే ఇచ్చేశారు. ఆ తర్వాత ప్రజల నుంచి విరాళాలు సేకరించడానికి వివిధ రకాలుగా ప్రయత్నాలు చేశారు. లాటరీలు వేయడం, నాటకాలు ప్రదర్శించడం వంటి అనేక పద్ధతులద్వారా విరాళాలు సేకరించారు. ఈ విద్యాసంస్థకు విరాళాల కోసం ఎక్కడికైనా వెళ్ళేవారు. ఎక్కడికి వెళ్ళడానికైనా సిగ్గుపడేవారు కాదు. చివరకు వేశ్యలు నివసించే వేశ్యవాడలకు కూడా వెళ్ళడానికి వెనుకాడలేదు. విద్యాసంస్థ స్థాపించడం తన లక్ష్యమని దాని కోసం ఎక్కడికైనా వెళతానని చెప్పేవారు. ఆయన స్వయంగా జోలె పట్టి నిలబడేవారు. ఆయనపై కోపంత మండిపడే మతపెద్దల్లో ఒకరు ఆ జోలెలో ఇంత మట్టి వేస్తే దాన్ని కూడా స్వీకరించి, నిర్మాణ కార్యక్రమంలో వాడుకుంటానని అన్నారు. తనకు విరాళాలిచ్చిన ప్రతి ఒక్కరి పేరును, ముఖ్యంగా విరాళాలిచ్చిన హిందువుల పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించేవారు. భారత ముస్లిమ్ సముదాయానికి సర్ సయ్యద్ చేసిన సేవలు మరపురానివి.

ఆయన నిర్మించిన కళాశాల 1920లో యూనివర్శిటీగా మారింది. కాని అప్పటికి సర్ సయ్యద్ ఈ లోకంలో లేరు. 1898లో మరణించారు. సర్ సయ్యద్ విద్యా ఉద్యమం సాధించిన విజయానికి అది ఒక నిదర్శనం. కాని తన సంస్కరణా ఉద్యమంలో సర్ సయ్యద్ ఎదుర్కొన్న వ్యతిరేకతను ప్రస్తావించకపోతే ఆయన ఎలాంటి స్థిరచిత్తాన్ని ప్రదర్శించారో, ఎంత నిర్భయంగా వ్యవహరించారో అర్ధంకాదు. 1857 తిరుగుబాటు సమయంలో ఆయన చీఫ్ జడ్జి. తిరుగుబాటు సిపాయిల నుంచి అనేకమంది అమాయక బ్రిటీషు పౌరుల ప్రాణాలను కాపాడాడు. ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలకు, బ్రిటీషు వారిని కాపాడినందుకు ఆంగ్ల ప్రభుత్వం ఆయనకు పెద్ద ఎస్టేటు బహుమతిగా ప్రకటించినా దాన్ని నిరాకరించారు. తనకు అవసరం లేదని చెప్పారు. నిజానికి 1857 తిరుగుబాటు విఫలమైన తర్వాత బ్రిటీషు వారి అమానుష కక్షసాధింపుల నేపథ్యంలో, ముఖ్యంగా ముస్లిములపై విరుచుకుపడిన ప్రళయాన్ని చూసిన తర్వాత ఆ మరుసటి సంవత్సరమే ఆయన తిరుగుబాటుకు కారణాలను విశ్లేషిస్తూ ఒక పుస్తకం రాశారు. ఆ పుస్తకం ఆయన ప్రచురించాలనుకున్నప్పుడు ఆయనకు సన్నిహితుడైనా ఆంగ్లమిత్రులు ఆయన్ను వారిస్తూ, ఆ పుస్తకం ప్రచురిస్తే మరణశిక్ష పడే అవకాశాలున్నాయని హెచ్చరించారు. అయినా ఆయన వెనుకాడలేదు. బ్రిటీషు వారి తప్పులను సూటిగా ఎత్తిచూపుతూ ఆ పుస్తకాన్ని ప్రచురించారు. అదే నిర్భీతి ఆయన విద్యాపరమైన, సామాజికమైన సంస్కరణల ఉద్యమంలోను ప్రదర్శించారు. మతపెద్దల ఆగ్రహానికి బెదరలేదు. ఆయన జీవించి ఉన్నంత కాలం మతపెద్దల విమర్శలు, ఫత్వాలను ఎదుర్కుంటూనే బతికారు.

ఆయన లండన్లో ఉన్నప్పుడు ఈ వ్యతిరేకత మరింత తీవ్రమైంది. తన విమర్శకులకు జవాబిస్తూ సర్ సయ్యద్ "కాన్పూర్ నుంచి ఆగ్రహోద్రేకాలతో ఇచ్చిన పిలుపులు, లక్నో నుంచి కవితాత్మకంగా వ్యంగ్యాస్త్రాలు, ఆగ్రా, అలహాబాదుల నుంచి పనిలేని పుకార్లు, రాంపూర్, బరేలీ నుంచి జారీ అయిన ఫత్వాలు, ఢిల్లీ మతపెద్దల పరుషపదాలు ఇవేవీ నేను పట్టించుకోను. నా ప్రజల సంక్షేమం గురించిన ఆలోచనే నా మనసంతా ఉంది. ఇతరులపై ఆగ్రహం, విచారాలకు అందులో స్థానమే మిగల్లేదు" అని రాశారు. మతపెద్దల వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని తన విద్యాసంస్థలో మతపరమైన పాఠ్యాంశాల విషయంలో తన పాత్ర ఏదీ ఉండదని ప్రకటించి, మతపెద్దల్లోనే ప్రముఖులను సంబంధిత సిలబస్ రూపొందించడానికి పిలిచారు. కాని ఈ మతపెద్దలెవ్వరు ఆ ప్రతిపాదనకు కూడా ఒప్పుకోలేదు.

మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ రాసిన జీవితచరిత్రలో సర్ సయ్యద్ మతభ్రష్టుడయ్యాడని 60 మంది మౌల్వీల సంతకాలతో ఫత్వా జారీ అయ్యిందని రాశారు. అప్పటి భారత ముస్లిమ్ మత పెద్దలందరూ సర్ సయ్యద్ వ్యతిరేకత విషయంలో ఒకేమాటపై ఉన్నారు. మౌల్వీ అలీ బక్ష్ మక్కా మదీనాలకు వెళ్ళి అక్కడి నుంచి కూడా సర్ సయ్యద్ కు వ్యతిరేకంగానే కాదు, ఆయన శిరస్సు ఖండించాలని ఫత్వా తీసుకొచ్చాడు.

ఈ వ్యతిరేకతలను, వైరాలను, వేటిని సర్ సయ్యద్ పట్టించుకోలేదు. ఈ వ్యతిరేకతలపై వ్యాఖ్యానిస్తూ "వారికేం తెలియదో నాకు తెలుసు, వారికి అర్ధం కానిది నాకు అర్ధమయ్యింది" అన్నారు. ఆయన చెప్పింది నిజమని చరిత్ర రుజువు చేసింది. ఆయన ప్రారంభించిన సంస్కరణ ఉద్యమం చాలా మార్పులు సాధించింది.



# ఇంక్విలాబ్ జిందాబాద్

- రుఫైదా

**ఇంక్విలాబ్ జిందాబాద్....** 1929లో, ఢిల్లీలోని సెంట్రల్ అసెంబ్లీపై దాడి చేసినప్పుడు భగత్‌సింగ్ గొంతు గర్జించిన నినాద మిది. అప్పటి నుంచి అనేక సందర్భాల్లో ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం వినిపిస్తూనే ఉంది. ఈ నినాదమిచ్చింది ప్రముఖ ఉర్దూ కవి, మేధావి, స్వతంత్ర సమరయోధుడు మౌలానా హస్రత్ మొహానీ. పూర్తిపేరు మౌలానా ఫజలుల్ హసన్ హస్రత్, ఆయన ఊరి పేరు మొహాన్. హస్రత్ మొహానీగా పిలవబడేవారు. 1921లో బ్రిటీషు వలసవాదులకు వ్యతిరేకంగా హస్రత్ మొహానీ ఇచ్చిన ఈ నినాదం నేటికి కూడా దోపిడీ వర్గాలకు వెన్నులో చలి పుట్టిస్తుంది.

**బోల్ కే లబ్ ఆజాద్ హై తెరె**
(నీ పెదాలు స్వేచ్ఛగానే ఉన్నాయని చెప్పు)
**బోల్ జబాం అబ్ తక్ తేరీ హై**
(నీ నాలుక ఇప్పటికీ నీదేనని చెప్పు)
**తెరా సుత్వాం జిస్మ్ హై తెరా** (నిటారైన దేహం నీదేనని చెప్పు)
**బోల్ కె జాన్ అబ్ తక్ తేరీ హై**
(నీ ప్రాణం ఇప్పటికీ నీదేనని చెప్పు)

అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకడైన ప్రముఖ ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన పంక్తులివి. అప్పటి నుంచి అనేక ఉద్యమాల్లో వినిపిస్తూనే వస్తున్నాయి.

హస్రత్ మొహానీ, ఫైజ్ అహ్మద్ ఫైజ్ ఈ పేర్లు, ఇలాంటి ఇంకా ఎన్నో పేర్లు.. ఈ పేర్ల ప్రస్తావన ఎందుకంటే, సుదీర్ఘమైన భారత స్వతంత్ర పోరాట చరిత్ర ముస్లిముల ప్రస్తావన లేకపోతే అసంపూర్ణమే. నిజం ఒక వెలుగురేఖ వంటిది. చీకటి పరదాల్లో చుట్టేసినంత మాత్రాన దాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. ఇప్పుడు జరుగుతున్నది అదే. భారతచరిత్రలో ముస్లిముల పాత్ర చరిత్ర పుస్తకాల పుటల నుంచి చెరిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎంతమందికి నేడు భారత స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ప్రముఖ ముస్లిము యోధుల పేర్లు తెలుసు. షాజహాన్ పూర్ కి చెందిన ముహమ్మద్ అష్ఫాకుల్లా ఖాన్ పేరు ఎంతమందికి తెలుసు. ఉరిశిక్ష పడినప్పుడు తన చివరి కోరికగా తన శవవస్త్రంలో మాతృభూమి మట్టిని కొంత వేయమన్న ఆ యోధుడిని ఎంత మంది నేడు స్మరిస్తున్నారు. అలాగే 95 సంవత్సరాల జీవిత కాలంలో 45 సంవత్సరాలు భారతదేశ బంధనాల విముక్తి కోసం జైళ్ళలో మగ్గి, సరిహద్దు గాంధీగా పేరుపడిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, దేశం కోసం పోరాడుతు జర్మనీలో 1927లో నిరుపేదగా మరణించిన గద్దర్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు బర్కతుల్లా భోపాలీ, గద్దర్ పార్టీలో విప్లవకారుడిగా 1915లో ఉరితాడును ముద్దాడిన సయ్యద్ రహ్మత్ షా, జౌన్ పూర్ కు చెందిన సయ్యద్ ముజ్తబా హుస్సేన్ తో కలిసి మలయా, బర్మాలలో భారత తిరుగు బాటు కోసం ప్రాణాలొడ్డి మరణశిక్షకు గురైన అలీ అహ్మద్ సిద్దీఖీ, భారత జాతీయ కాంగ్రేసు ఖర్చుల కోసం గాంధీజీకి బ్లాంక్ చెక్ ఇచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఉమర్ సుభానీ (ఆయన దేశం

కోసం తన ప్రాణాలు కూడా త్యాగం చేశాడు), ముహమ్మద్ బషీర్, ఖుదా బక్ష్, ఏ. జకరియా, జఫర్ హసన్, అల్లాహ్ నవాజ్, అబ్దుల్ అజీజ్... ఈ పేర్ల జాబితా చాలాపెద్దది. కాని ఒక్క పేరైనా నేడు మన విద్యార్థులు ఎక్కడైనా చదువుతున్నారా?

భారత స్వతంత్ర పోరాట చరిత్ర రెండువందల సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. 1757 జూన్‌లో జరిగిన ప్లాసీ యుద్ధంలో బ్రిటీషు వారి వలసవాద దోపిడికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు పూనుకున్న నవాబ్ సిరాజుద్దౌలా భారతదేశంలోని వివిధ సంస్థానాల రాజులందరినీ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకం చేసే ప్రయత్నం చేశాడు. కాని, యుద్ధంలో ఓడిపోయాడు. మరణ శిక్షకు గురైనప్పుడు ఆయన వయసు కేవలం 24 సంవత్సరాలు. 1764లో నవాబ్ మీర్ ఖాసిమ్ బ్రిటీషు వారిని బక్సర్ యుద్ధంలో ఎదుర్కొన్నాడు. దురదృష్టవశాత్తు ఆయన కూడా ఓడిపోయాడు. బెంగాల్, బీహార్, ఒడిశాలలో బ్రిటీషు వారిని నిలువరించింది ఈ పాలకులే. వారి ఓటమి తర్వాత బ్రిటీషు కంపెనీ అక్కడ విస్తరించింది. అంతకు ముందు 1763లోనే బెంగాల్లోని ముస్లిమ్ ఫకీర్లు బ్రిటీషువారిపై తిరగబడ్డారు. మజ్నూ షా ఫకీర్ నాయకత్వం లోని ఈ తిరుగుబాటుకు సన్యాసి ఉద్యమ నాయకులు భవానీ పాఠక్ మద్దతు పలికారు. ముస్లిమ్ ఫకీర్లు, హిందూ సన్యాసులు కలిసికట్టుగా వలసప్రభుత్వంపై తిరగబడిన ఆ పోరాటమే సన్యాసీ ఫకీర్ తిరుగుబాటు. 1800 వరకు ఈ పోరాటం కొనసాగింది. 1820లో హాజీ సయ్యద్ అహ్మద్ బరేల్వీ స్వతంత్ర పోరాటానికి కొత్త ఊపిరి ఊదారు. అహ్మద్ బరేల్వీ ప్రారంభించిన వహాబీ ఉద్యమం 1870 వరకు కొనసాగింది. నిజామ్ సోదరుడు ముబారిజుద్దౌలా కూడా ఈ ఉద్యమంలో చేతులు కలిపాడు. మరోవైపు ఫరాజీ ఉద్యమం ప్రారంభించిన హాజీ షరియాతుల్లా సాయుధ పోరాటానికి మారుపేరయ్యాడు. 1830 నుంచి 1900 వరకు ఈ ఫరాజీ ఉద్యమం నడిచింది. 1857లో బేగం హజ్రత్ మహల్ బ్రిటీషు వారికి వ్యతిరేకంగా సైన్యాలు నడిపింది. బేగం అజీజున్ కేవలం పాతికేళ్ళ వయసులో సైన్యాలను కమాండ్ చేసింది. అజీజున్ యుద్ధరంగంలోనే ప్రాణాలర్పించింది. హబీబా బేగం, ఆకుపచ్చ దుస్తుల మహిళ ఇలా అనేకమంది ముస్లిమ్ మహిళలు ఈ పోరాటాల్లో కనిపిస్తారు. ఆ తర్వాత దేశస్వతంత్ర పోరాటాన్ని ముందుకు నడిపించింది మైసూరు పులి టిప్పు సుల్తాన్, ఆయన తండ్రి హైదర్ అలీ. 1767 నుంచి 1999 వరకు ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టారు. చివరకు 1799లో జరిగిన నాలుగవ మైసూరు యుద్ధంలో టిప్పూ యుద్ధరంగంలో మరణించాడు. 1803లో షా వలీ ఉల్లా కుమారుడు అబ్దుల్ అజీజ్ షా బ్రిటీషు వారికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయాలని ఫత్వా జారీ చేసిన విషయం ఎందరికి తెలుసు. బ్రిటీషు దోపిడికి వ్యతిరేకంగా జిహాద్ కోసం ఇచ్చిన మొదటి ఫత్వా ఇది. ఆ తర్వాత ఆయన శిష్యుడు సయ్యద్ అహ్మద్ బరేల్వీ (1786 నుంచి 1831) ఈ పోరాటాన్ని కొనసాగించిన వైనం చరిత్రపుటల్లో ఉంది. ఆ తర్వాత ప్రథమ స్వతంత్ర సంగ్రామంగా పేరుపడిన 1857 సిపాయిల తిరుగుబాటులో ముస్లిము ఉలమాలు పోషించిన పాత్ర నేడు ఎంతమందికి తెలుసు. అదంతా ఇప్పుడు మరిచి పోయిన చరిత్రగా మారిపోయింది.

1857 తిరుగుబాటుకు అనేక కారణాల్లో అబ్దుల్ అజీజ్ షా జారీ చేసిన ఫత్వా కూడా ముఖ్యమైన కారణం. ఆ తర్వాత మరో ఫత్వా కూడా అలాంటిదే జారి అయ్యింది. దానిపై 34మంది ఉలమాలు సంతకాలు చేశారు. మౌలానా ఖాసిమ్ నానోతావి (ఈయనే తర్వాత దేవ్ బంద్ విద్యాసంస్థ దారుల్ ఉలూమ్ దేవ్ బంద్ స్థాపించారు), మౌలానా రషీద్ అహ్మద్ గంగోహీ, హాఫిజ్ జామిన్ షహీద్ (షామ్లీలో హాజీ ఇమ్దాదుల్లా నాయకత్వాన బ్రిటీషు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడారు) వంటి ప్రముఖుల సంతకాలతో వెలువడిన ఫత్వా అది. ప్రముఖ ఉలమాలు వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా యుద్ధమైదానంలోకి రావడంతో సాధారణ ప్రజలు, సిపాయిల్లోను ఉత్సాహం పెల్లుబికింది. ఈ తిరుగుబాటు విఫలమవ్వడానికి కారణాలు అనేకం ఉన్నాయి, కాని గమనించవలసిన విషయమేమంటే, ఈ తిరుగుబాటు తర్వాత "మౌల్వీ" అంటే "విప్లవవాది"కి పర్యాయపదంగా బ్రిటీషువారు భావించారు. 1857 తిరుగుబాటు తర్వాత ఆంగ్ల దమనకాండకు అత్యధికంగా గురైంది ముస్లిములే. ముఖ్యంగా ముస్లిమ్ ఉలమాలను వేటాడి చంపారు. దాదాపు లక్షమంది మరణించారు. అందులో అత్యధికులు ఉలమాలే. ఒక్క ఢిల్లీలోనే 1857-58 మధ్యకాలంలో 27,000 మంది ఉలమాలను ఉరితీశారు. ఇది శిక్షలు పడి ఉరి తీసిన వారి సంఖ్య. ఊచకోతల్లో ఎంతమంది మరణించారో నిజమైన లెక్కలు లేవు. ఖాజీ అబ్దుర్రహీమ్ తల్లి అస్గరీ బేగం బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడి వారిలో ఎలాంటి వణుకు పుట్టించిందంటే, ఆమె పట్టుబడిన తర్వాత సజీవదహనం చేశారు. ఈ తిరుగుబాటులో ప్రాణాలర్పించిన 225 మంది ముస్లిమ్ మహిళల పేర్లు మనకు దొరుకుతాయి. 1857కు ముందు ముగల్ చక్రవర్తి హోదాలోనే బహదూర్ షా జఫర్ ఉన్నాడు. బ్రిటీషు వారు ఆయన హోదాను కొనసాగించారు. కాని, ఈ హోదాలను చక్రవర్తి పట్టించుకోలేదు. తిరుగుబాటు యోధులతో

కలిసి నాయకత్వం వహించాడు. చివరకు రంగూను జైలులో మరణించాడు. ఆయన కుమారులను ఆంగ్లేయులు చంపి వారి తలలు ఆయనకు కానుకగా పంపారు.

భారత స్వతంత్ర పోరాటంలో మహిళలు అన్న పుస్తకాన్ని మన్మోహన్ కౌర్ రాశారు. ఆ పుస్తకంలో కేవలం ఇద్దరే ఇద్దరు ముస్లిమ్ మహిళల పేర్లు కనిపిస్తాయి. ఒకరు బేగం హజ్రత్ మహల్, రెండవవారు బీబీ అమ్మా. మౌలానా ముహమ్మద్ అలీ తల్లి ఆబాదీ బేగం, ఆయన భార్య అంజాదీ బేగం, అమీనా తయ్యబ్జీ, బేగం సకీనా లుక్మానీ, నిషాతున్నిసా, సాదత్ బాను కిచ్లు, జులేఖా బేగం, మెహర్ తాజ్, జుబేదా బేగం దావూదీ, కనీజ్ సాజిదా బేగం, మునీరా బేగం, అస్మత్ ఆరా బేగం, సుగ్రా ఖాతూన్, రెహానా తయ్యబ్జీ, హమిదా తయ్యబ్జీ, ఫాతిమా తాయిబ్ అలీ, సఫియా సాద్ ఖాన్, కుల్సుమ్ సియానీ వంటి వందలాది మహిళలెవ్వరు నేడు ఎవరికీ గుర్తు లేరు.

ప్రథమ స్వతంత్ర సంగ్రామం తర్వాత 1877లో షేకుల్ హింద్ మౌలానా మహ్మూద్ హసన్ "సమారతుల్ తర్బియత్" అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ బ్రిటీసు వలసదోపిడికి వ్యతిరేకంగా సాయుధ పోరాట శిక్షణ ఇవ్వడానికి ఉద్దేశించిన సంస్థ. దాదాపు 30 సంవత్సరాల కాలం ఈ సంస్థ పోరాడింది. 1909లో ఈ సంస్థను పునర్వ్యవస్థీకరించి, ముజాహిదీన్లందరినీ జామియతుల్ అన్సార్ సంస్థ పేరిట ఏకం చేశారు. మౌలానా ఉబైదుల్లా సింధీని దేవ్ బంద్ పిలిచి ఈ కొత్త సంస్థలో బాధ్యతలు అప్పగించారు. 1911లో దేవ్‌బంద్‌లో జామియతుల్ అన్సార్ పరిచయసభలో దాదాపు 30వేల మంది ఉలమాలు పాల్గొన్నారు. దేశ స్వతంత్రం కోసం బ్రిటీషు వలస ప్రభుత్వంతో పోరాడవలసిన అవసరం ఎందుకు అన్న విషయమై జరిగిన సమావేశం ఇది. 1911లోనే జామియతుల్ అన్సార్ మొదటి ర్యాలీ మురాదాబాద్‌లో జరిగింది. జామియతుల్ అన్సార్ కార్యకలాపాలు, ప్రజాదరణ చూసి ప్రభుత్వం బెంబేలెత్తింది. దేవ్‌బంద్ విద్యాసంస్థ నుంచే ఈ సంస్థ పనిచేస్తుంది కాబట్టి విద్యాసంస్థపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలుంటాయని భావించిన దారుల్ ఉలూమ్ దేవ్ బంద్, మౌలానా మహ్మూద్ హసన్ విద్యాసంస్థ నుంచి రాజీనామా చేయాలని కోరింది. 1913లో జామియతుల్ అన్సార్ పై నిషేధం వచ్చింది. ఆ వెంటనే మౌలానా మహ్మూద్, ఉబైదుల్లా సింధీలు "నజ్జారతుల్ మారిఫ్" పేరుతో కొత్త సంస్థను స్థాపించి పోరాటాన్ని కొనసాగించారు. ఈ లోపు మొదటి ప్రపంచయుద్ధం రావడంతో స్వతంత్రపోరాట యోధులు ఇది గొప్ప అవకాశంగా భావించారు. బ్రిటీషు సైన్యాలపై సాయుధ దాడులకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉబైదుల్లా సింధీ కాబూల్ వెళ్ళారు. మౌలానా స్వయంగా సౌదీ వెళ్ళారు. ముస్లిమ్ దేశాల నుంచి మద్దతు కూడగట్టే ప్రయత్నమిది. సౌదీ చేరుకున్న మౌలానా టర్క్ గవర్నర్ గాలిబ్ పాషాని కలిశారు. ఆయన మద్దతు హామీ పొందారు. మొదటి ప్రపంచయుద్ధంలో అమెరికా అడుగుపెట్టడంతో బలాబలాలు తారుమారయ్యాయి. జర్మనీ ఓడిపోయింది. ఉస్మానియా ఖిలాఫత్ నాశనమైంది. భారత స్వతంత్ర యోధుల ప్రయత్నాలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

కాబూల్ చేరుకున్న మౌలానా ఉబైదుల్లా సింధీ ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. ఇది మొదటి ప్రవాస ప్రభుత్వం. అధ్యక్షుడిగా మహరాజా ప్రతాప్ సింగ్, మంత్రులుగా ఉబైదుల్లా సింధీ, బర్కతుల్లా భోపాలీలతో ఏర్పడిన ప్రభుత్వమిది. దాంతో పాటు స్వేచ్ఛాసేన (లష్కరె నజాత్ దహిందా) ఏర్పాటు చేశారు. మౌలానా ఉబైదుల్లా సింధీ కాబూల్ నుంచి మౌలానా మహ్మూద్ కు ఒక సిల్కు వస్త్రంపై రాసిన లేఖ తర్వాత బ్రిటీషువారి చేతికి చిక్కింది. రేష్మీ రుమాల్ సంఘటనగా ఇది చరిత్రలో నమోదైంది. ఈ లేఖ బయల్పడడంతో దేశంలోని 222 మంది ప్రముఖ ఉలమాలను బ్రిటీషు ప్రభుత్వం అరెస్టు చేసి కేసులు నడిపింది.

భారత జాతీయ కాంగ్రెసు 1885లో ఏర్పడింది. హిందూ ముస్లిములంతా కలిసి ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్న ఉద్దేశ్యంతో ఏర్పడిన సంస్థ. ఈ సందర్భంగా 300 కన్నా ఎక్కువ మంది ఉలమాల సంతకాలతో ఒక ఫత్వా జారీ అయ్యింది. హిందూ ముస్లిము ప్రజానీకం అంతా కలిసి సమైక్యంగా ఆంగ్ల ప్రభుత్వంపై పోరాడాలని జారీ అయిన ఫత్వా ఇది. నుస్రతుల్ అబ్రార్ పత్రికలో ఈ ఫత్వా అనేకసార్లు ప్రచురించారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ప్రారంభించిన అల్ హిలాల్ ఈ పోరాటం కోసం ఏర్పడిన పత్రికే.

ఆ తర్వాత ఖిలాఫత్ ఉద్యమంలోను, సహాయ నిరాకరణోద్యమాల్లోను భారత ముస్లిములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమానికి మద్దతిస్తూ షేకుల్ హింద్ మౌలానా మహ్మూద్ ప్రకటన జారీ చేశారు. 1920 అగష్టు 31న సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమైంది. మౌలానా ఆ ఉద్యమానికి మద్దతివ్వడమే కాదు, ఆ తర్వాత 500 మంది ఉలమాల సంతకాలతో ఫత్వా కూడా జారీ అయ్యింది. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమాలకు మద్దతుగా వచ్చిన ఈ ఫత్వాలు

ప్రజాందోళనకు ఎంతో తోడ్పడ్డాయి. ఖిలాఫత్ కమిటీ జారీ చేసిన సహాయనిరాకరణ ఫత్వాను 1921లో బ్రిటీషు ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ప్రకటించింది. మౌలానా హుస్సేన్ అహ్మద్ మదనీ, మౌలానా ముహమ్మద్ అలీ జోహర్, మౌలానా షౌకత్ అలీ, మౌలానా నిసార్ అహ్మద్ కాన్పూరీ, పీర్ గులాం ముజద్దిద్, డా. సైఫుద్దీన్ వంటి అనేకమంది అరెస్టయ్యారు. విదేశీ వస్తు బహిష్కరణలోను అనేకమంది ముస్లిమ్ ఉలమాలు పాల్గొన్నారు. ఈ పోరాటలన్నింటా హిందూ ముస్లిమ్ సమైక్యత ప్రస్ఫుటంగా మనకు కనిపిస్తుంది. కాని తర్వాత శుద్ధీకరణ వంటి వాటి వల్ల, హిందూ ముస్లిముల మధ్య బ్రిటీషు ప్రభుత్వం విభేదాలు, వైమనస్యాలు పెంచడంలో విజయం సాధించింది.

దక్షిణాదిలోను విశాఖపట్నంలో సుబేదార్ అహ్మద్ అతని అనుచరులను బ్రిటీషువారు కాల్చి చంపారు. పఠాన్ తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్ వంటి వీరులు హైదరాబాదులో బ్రిటీషు రెసిడెన్సీపై దాడి చేశారు. తుర్రేబాజ్ ఖాన్‌కు ఉరిశిక్ష విధించారు.

భారత స్వతంత్ర పోరాట చరిత్రలో ముస్లిములు పోషించిన పాత్ర నిరాకరించలేనిది. హిందూ ముస్లిమ్ ప్రజానీకమంతా కలిసికట్టుగా వలసవాద పాలకులపై సమరభేరి మోగించారు. బ్రిటీషు పాలకులు ఒక పథకం ప్రకారం హిందూ ముస్లిముల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా 1757 తర్వాతి నుంచి అడపాదడపా జరుగుతున్న తిరుగుబాట్లలో ముస్లిములే ప్రముఖంగా కనబడడంతో 1843లో లార్డ్ ఎల్లెన్ బరో మొత్తం ముస్లిం సముదాయం బ్రిటీషు వారికి అవిధేయమైందని ప్రకటించాడు. ముస్లిములకు వ్యతిరేకంగా హిందువుల వైపు మొగ్గు చూపే విధానం అనుసరించాలని సూచించాడు. వి.డి.మహాజన్ ఈ విషయాలు రాశారు. 1857 తిరుగుబాటు తర్వాత జాన్ లారెన్స్ వంటి వారు భారతదేశంలో హిందూ ముస్లిముల మధ్య విభేదాలు పెంచే విధానం అవసరమని నొక్కి చెప్పారు.

జలియన్ వాలాబాగ్‌లో అనేకమంది ముస్లిములు ప్రాణాలు త్యజించారు. ఈ సభకు సైఫుద్దీన్ కిచ్లు, సత్యపాల్ నాయకత్వం వహించారన్నది కూడా గుర్తుంచుకోవాలి. ఈ సభకు ముఖ్య అతిథి డా. బషీర్. ఉర్దూ భాష భారత స్వతంత్ర సంగ్రామంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. అల్ హిలాల్, కామ్రేడ్, అల్ బలాగ్ వంటి పత్రికలు భారత స్వతంత్ర సంగ్రామంలో కీలకభూమిక పోషించాయి. జమియతె ఉలమా హింద్, మజ్లిస్ అష్రఫుల్ ఇస్లామ్, ఖుదాయీ ఖిద్మత్ గార్, షియా పొలిటికల్ కాన్ఫరెన్స్ వంటి సంస్థలు పోషించిన పాత్ర మరువరానిది.

శాంతిమయ్ రాయ్ రాసిన ఫ్రీడమ్ మూవ్ మెంట్ అండ్ ఇండియన్ ముస్లిమ్స్, పి.ఎన్. చోప్రా రాసిన రోల్ ఆఫ్ ఇండియన్ ముస్లిమ్స్ ఇన్ ది స్ట్రగుల్ ఆఫ్ ఫ్రీడమ్, కాంతా చోబే రాసిన ముస్లిమ్స్ అండ్ ఫ్రీడం మూవ్ మెంట్ ఇన్ ఇండియా ఇలా అనేక మంది ముస్లిముల పాత్ర గురించి రాశారు. తెలుగులో సయ్యద్ నశీర్ అహ్మద్ రాసిన పుస్తకాలు కూడా భారత స్వతంత్ర సంగ్రామంలో ముస్లిముల పాత్రను తెలియజేస్తున్నాయి. భారత స్వతంత్ర సంగ్రామంలో హిందూముస్లిమ్ ఐక్యతకు సంబంధించిన ఈ ఉదాత్త చరిత్రను పాఠశాలల స్థాయి నుంచి పిల్లలకు బోధించినప్పుడే దేశ ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన వాతావరణం రూపొందుతుంది. దురదృష్టవశాత్తు నేడు ముస్లిముల పేర్లను చరిత్ర పుస్తకాల నుంచి తుడిచివేసే ప్రయత్నాలే ఎక్కువగా జరుగుతున్నాయి.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**54 ఆయత్‌లు**

# 41. హా మీమ్ అస్ సజ్దా

**మక్కా అవతరణ**

53 అనతి కాలంలోనే మేము వీరికి మా సూచనలు గగనతలంలోనూ చూపిస్తాము, స్వతహాగా వీరి 'స్వయం' లోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖుర్ఆన్ సత్యబద్ధమయినదన్న విషయం వారికి ప్రస్ఫుటమయి పోతుంది.[70] నీ ప్రభువు ప్రతి విషయానికీ ప్రత్యక్ష సాక్షి అన్న మాట సరిపోదా?

**(70వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ విప్లవం, అది రూపొందించిన సమాజంలో సాధారణ మానవుణ్ణి నైతికత రీత్యా, శీలం రీత్యా, పరిశుద్ధత, పరిశుభ్రతల రీత్యా ఎంతో ఉన్నతంగా సముద్ధరించింది. ఇతర సమాజాల ప్రముఖ వ్యక్తులు సయితం వీరి స్థాయికి ఎంతో తక్కువగా కనిపించసాగారు. ఇది మానవుల్ని మూఢ నమ్మకాలు, మూర్ఖమయిన ఆచారాల చక్రవ్యూహం నుండి విడుదల చేయించి సశాస్త్రీయ పరిశోధన, సమంజసమయిన సహేతుకమయిన ఆలోచనా విధానాల రాచబాటన నడిపించింది. అది సామూహిక జీవితంలోని రుగ్మతల చికిత్స చేసింది. వాటి చికిత్స పట్ల ఆలోచన కూడా ఇతర వ్యవస్థలలో కానరాదు, లేదా ఎవరయినా వాటిని గురించి ఆలోచించినా ఆ రుగ్మతల చికిత్సలో వారు విజయం సాధించలేదు. ఉదాహరణకు వర్ణం, వంశం, దేశం, భాషల ఆధారంగా మానవుల మధ్య వివక్ష, ఒకే సమాజంలో వర్గాల విభజన, వారి మధ్య నిమ్నోన్నతా భేదభావాలు, అంటరానితనం, చట్టంలో హక్కుల్లోనూ ఆచరణాత్మక సామాజిక వ్యవస్థలోనూ సమానత లేమి, స్త్రీల వెనుకబాటుతనం, వారు ప్రాథమిక హక్కులకూ నోచుకోకపోవడం నేరాల ఆధిక్యత, సారాయి, మత్తుగొలిపే పదార్థాల చెలామణి, ప్రభుత్వం విమర్శకు, జవాబుదారీతనానికీ అతీతమయినదిగా అలరారటం, సామాన్య ప్రజలు ప్రాథమిక మానవీయ హక్కులకు వంచితులవడం, అంతర్జాతీయ సంబంధాలలో ఒప్పందాలను గౌరవించకపోవడం, యుద్ధంలో క్రూరమయిన చేష్టలు, ఇంకా ఇలాంటివే అనేక రుగ్మతలు ఉండేవి. అన్నింటికన్నా అధికంగా స్వయాన అరేబియా భూభాగంలో ఈ విప్లవం వల్ల చూస్తూ ఉండగానే, అరాచకత్వం స్థానే సువ్యవస్థ రక్తపాతం, అశాంతుల స్థానంలో శాంతి అపరాధాలు, పాపాలు జరిగేచోట ధర్మనిష్ఠ, పరిశుద్ధత, పవిత్రత అన్యాయం, అధర్మం, అత్యాచారాల స్థానే న్యాయం మాలిన్యం, అనాగరికత స్థానంలో పరిశుద్ధత, నాగరికతలు అజ్ఞానం ఉన్నచోట జ్ఞానం తరతరాలుగా సాగే వైషమ్యాల స్థానంలో సోదర భావం, ప్రేమ అనురాగాలు పెంపొందాయి. తమ తెగ నాయకత్వానికి మించిన మరే వస్తువునూ కలగనలేని జాతి ప్రజలను ప్రపంచ నాయకులుగా చేసివేసింది. ఈ సూచనల్ని అదే తరం తన కళ్ళారా చూసుకుంది. దాన్ని సంబోధిస్తూనే ప్రవక్త మహనీయులు (స) తొలిసారిగా ఈ ఆయత్‌ని వినిపించారు. ఆ తరువాత నేటి వరకు పరమ ప్రభువు ఆ సూచనల్ని నిరంతరం చూపిస్తూనే ఉన్నాడు. ముస్లిములు తమ పతన దశలోనూ నెలకొలిపిన నైతికతా ఉన్నత ప్రమాణాల ధూళికి కూడా చేరలేదు-నేడు సభ్యతా సంస్కారాలకు ధ్వజవాహకులుగా ప్రకటించుకునే పెద్దలు! యూరపు జాతులు ఆఫ్రికా, అమెరికా, ఆసియా, స్వయంగా యూరపులో పరాజిత జాతుల ఎడల నిర్వహించిన నడవడిని, ముస్లిముల చరిత్రలోని ఏ కాలంలోనూ దాని దృష్టాంతం ఒక్కటీ చూపెట్టలేరు. ఈ ఖుర్ఆన్ అందజేసే శుభం కారణంగానే ముస్లిముల్లో ఈ మేరకు మానవత జనించింది. వారు విజయం సాధించినా ముస్లిమేతరులు చరిత్రలోని ఏ కాలంలోనయినా దౌర్జన్యపరులుగా గోచరిస్తున్నట్లుగా, నేటి వరకూ అలాగే కానవస్తున్నట్లుగా ముస్లిమ్ పాలకులు ఎన్నడూ దుర్మార్గులు కాలేక పోయారు. కళ్ళున్నవారు స్వయంగా చూసుకోవచ్చు.

**(70వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ[أَحَادِيثِ]الْأَنْبِيَاءِ

## 1. దైవప్రవక్తల (హదీసుల) ప్రకరణం

### అధ్యాయం : 37 సాద్ సూరాలో మహనీయ దావూద్(అలైహిస్సలామ్) ప్రస్తావన

వారికి మా దాసుడు దావూద్ వృత్తాంతాన్ని వినిపించు. అతను గొప్ప బలవంతుడు, ప్రతి వ్యవహారంలోనూ అల్లాహ్ వైపునకు మరలుతూ ఉండేవాడు. మేము పర్వతాలను అతనికి లొంగిపోయేలా చేశాము. ఉదయం, సాయంత్రం అవి అతనితోపాటు కీర్తన చేసేవి. పక్షులు గుమిగూడేవి, అవన్నీ అతని కీర్తన వైపునకు శ్రద్ధతో మరలేవి. మేము అతని రాజ్యాన్ని శక్తిమంతమైనదిగా చేశాము. అతనికి వివేకాన్ని ప్రసాదించాము. తిరుగులేని తీర్పు చెప్పే సామర్థ్యాన్ని అనుగ్రహించాము. *(38 సాద్ : 17-20)*

**'ఫస్‌లల్ ఖితాబ్'** అంటే న్యాయనిర్ణయం గైకొనటంలో గల విచక్షణా జ్ఞానం అని ముజాహిద్ వ్యాఖ్యానించారు. **'తుష్‌తిత్'** అంటే అన్యాయం చేయకండి. మాకు సరైన మార్గం చూపండి అని అర్థం.

"ఇతను నా సోదరుడు. ఇతని వద్ద తొంభై తొమ్మిది గొర్రెలున్నాయి. నా దగ్గరేమో కేవలం ఒకే ఒక గొర్రె ఉన్నది- ఇక్కడ 'గొర్రె' అనే పదం 'భార్య' నేపథ్యంలో ఉంది.. యదార్థం ఏమిటంటే కలసి ఒకచోట ఉండేవారు తరచూ ఒకరికొకరు అన్యాయం చేసుకుంటూ ఉంటారు.[1] అయితే విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రం దీనికి దూరంగా ఉంటారు. అటువంటివారు కొందరు మాత్రమే."

... దావూద్ విషయాన్ని అర్థం చేసుకున్నాడు. కనుక అతను తన ప్రభువును క్షమాపణ కోరుకున్నాడు. సజ్‌దాలో పడిపోయాడు. పశ్చాత్తాపంతో ప్రభువు వైపునకు మరలాడు. అప్పుడు మేము అతని తప్పును మన్నించాము. నిశ్చయంగా మా వద్ద అతని కొరకు సాన్నిహిత్యం, ఉత్తమ పర్యవసానం ఉన్నాయి.

**89)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: "సాద్ సూరాలోని 'సజ్‌దహ్'కు ప్రణమిల్లటం తప్పనిసరి కాదు. అయితే నేను ఈ సూరాలో దైవప్రవక్త (సఅసమ్) సాష్టాంగ ప్రణామం చేస్తూ ఉండగా చూశాను."


అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "దావూద్‌కు మేము సులైమాన్(వంటి కొడుకు)ను ప్రసాదించాము; అతను మంచి దాసుడు. అత్యధికంగా తన ప్రభువు వైపునకు మరలుతూ ఉండేవాడు." *(సాద్: 30)*

"నా ప్రభూ! నన్ను క్షమించు. నా తర్వాత మరెవ్వరికీ లభించని రాజ్యాధికారాన్ని నాకు ప్రసాదించు" *(సాద్: 35)* అని హజ్రత్ సులైమాన్ వేడుకోవటం ప్రత్యేకంగా గమనార్హం.

అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "సులైమాన్ రాజ్యం పేరు చెప్పి షైతానులు ప్రచారం చేసే విషయాలను వారు అనుసరించసాగారు." **(2: 102)**

సూరయె సబాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మేము సులైమాన్‌కు గాలిని వశపరిచాము. అది ఉదయం పూట ఒక నెల రోజుల పాటి ప్రయాణాన్ని పూర్తి చేయగలిగేది. సాయంకాలం పూట కూడా ఒక నెల రోజులపాటి ప్రయాణాన్ని చేయగలిగేది. మేము ఆయనకు కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. తమ ప్రభువు ఆదేశానుసారం అతని సన్నిధిలో సేవలు చేసే జిన్నాతులను మేము అతనికి వశవర్తులుగా చేశాము. వారిలో మా ఆజ్ఞను ఉల్లంఘించిన వాడికి మేము జ్వలించే అగ్నిని రుచి చూపేవారము. వారు అతనికి అతను కోరినవన్నీ చేసేవారు, ఎత్తయిన కట్టడాలు, చిత్రాలు, కోనేరుల వంటి పెద్ద పళ్లాలు, తమ స్థానం నుండి కదలని భారీ దేగిసాలు-దావూద్ ప్రజలారా! కృతజ్ఞతతో పని చేయండి, నా దాసులలో కృతజ్ఞతలు తెలిపేవారు తక్కువే.
*(34 సబా : 12,13)*

37-1. కొందరు వ్యాఖ్యాతల ప్రకారం మహనీయ దావూద్ (అ)కు 99 మంది భార్యలున్నప్పటికీ ఆయన దృష్టిలో అందగత్తె అయిన వేరొకని ఇల్లాలు పడింది. ఆయన మదిలో ఆమెను మనువాడాలన్న ఆలోచన వచ్చింది. అంతే, అల్లాహ్ ఆయన్ని నిలదీయడానికి ఇద్దరు దైవదూతలను మానవాకారంలో పంపాడు. వారిద్దరూ ఒక కేసును ఆయన దగ్గరకు తీసుకు వచ్చారు. వారి వాదోపవాదాలు వినగానే హజ్రత్ దావూద్(అ)కు తన తప్పు తెలిసివచ్చింది. పశ్చాత్తాప భావంతో అల్లాహ్ వైపునకు మరలారు. ఈ వృత్తాంతానికి కొందరు వ్యాఖ్యాతలు ఉప్పు కారం తగిలించి, ఒక ప్రవక్తకు ఎంతమాత్రం శోభాయమానం కాని రీతిలో కథలల్లారు.



# సామ్రాజ్యానికి సవాల్

73

- ఎస్.ఎమ్. మలిక్

### సమూద్ జాతి

ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తబూక్ వైపునకు ప్రయాణమవగా సరిగ్గా మదీనాకు, తబూక్‌కు మధ్యన 'సమూద్' జాతి శిథిల జనావాసాలు తారసపడ్డాయి. 'ఆద్' జాతి తరువాత 'సమూద్' జాతి అల్ హిజ్ర్ ప్రాంతాన నివసించింది. ఇవి అతి ప్రాచీన అరబ్బు జాతులు. అది దాదాపు క్రీ.పూ.30 శతాబ్దులకు పూర్వపు మాట. 'ఆద్' జాతి అయినా 'సమూద్' అయినా దైవ అవిధేయ జాతులు, బహు దైవారాధకులు, తమ కొరకు ప్రభవించిన ప్రవక్తలను తిరస్కరించిన జాతులు; ఫలితంగా దైవశిక్షకు గురయి సర్వనాశనమయిపోయిన దుష్టజాతులు. వారి వినాశ గాథలు అరేబియాలో చిన్న పిల్లల నోట కూడా వినవచ్చేవి. అజ్ఞాన కాలపు అరబ్బు కవుల కవితల్లో వాటి ప్రస్తావన తరచుగా లభిస్తుంది. అసీరియా (ASSYRIA) శిలా ఫలకాలలో, గ్రీకు, రోమను చరిత్రకారుల వ్రాతల్లో, భౌగోళిక శాస్త్రజ్ఞుల ప్రస్తావనల్లో వారి ప్రస్తావనలు ప్రాప్తమవుతాయి. ఏసుక్రీస్తు జననానికి కాస్త పూర్వం వరకు ఆ జాతి అవశేషాలు కానవచ్చేవి. వీరు రోమను సేనలోనూ పాల్గొన్నారన్న ప్రస్తావనలు రోమను చారిత్రక గాథల్లో కానవస్తాయి. ఇప్పటికీ సఊదీ అరేబియా పశ్చిమోత్తర భాగాన ఆ జాతి నగరాల అవశేషాలు కానవస్తాయి. ఆ ప్రాంతాన్ని ఇప్పటికీ అల్ హిజ్ర్ అని పిలుస్తారు. ప్రవక్తశ్రీ(స) బిడారు ఆ ప్రాంతం చేరినపుడు తన అనుయాయుల్ని సమావేశపరచి ఓ ప్రసంగం చేశారు. అందులో సమూద్ జాతి దురంతాన్ని గురించి గుణపాఠం గరిపించి, ఇది దైవశిక్ష అవతరించిన నేలయని, ఇది వ్యాహ్యాళి స్థలం కాదని, ఇక్కడి నుంచి వడివడిగా సాగిపోవాలని సెలవిచ్చారు. ఆ ప్రయాణం ఇంకా ముందుకు సాగగా అనేక మజిలీలు దాటి కడకు ఇస్లామీయ యోధులు తబూక్ ప్రాంతానికి చేరుకున్నారు.

### రోమనుల పలాయనం

అక్కడికి చేరిన తరువాత తెలిసింది కైసరు అతని అనుయాయులు తమ సేనల్ని అక్కడి నుండి తొలగించి వెళ్లిపోయారని, శత్రువులు అక్కడి నుండి, ఇస్లామీయ వీరులు రాకపూర్వమే తొలిగిపోయారని. వాస్తవానికి గట్టి దాడి చెయ్యాలన్న సంకల్పంతో సేనల్ని ప్రోగు చేస్తూ ఉండగా, సన్నాహాలు ఇంకా పూర్తికాక మునుపే అకస్మాత్తుగా ముస్లిమ్ సేనలు వచ్చేయడం గమనించి ఎదుర్కోకుండా తప్పించుకు పారిపోవడమే శరణ్యం అనిపించిందేమో,

మెల్లిగా జారుకున్నారు. వారు లోగడ, మూతా పోరాటం సందర్భంలో మూడు వేల ఇస్లామీయ యోధులు ఒక లక్ష రోమను సేన సమక్షంలో చూపిన ధైర్యం, శూర్య సాహసాలు గమనించే ఉన్నారు. ఈసారి ముస్లిములు మరింత బలోపేతు లయి 30 వేల మంది, మదీనా నుండి వైరి వీరుల్ని ఎదుర్కొ నేందుకు, ప్రయాణమయి వస్తున్నారన్న సమాచారం తెలిసి, రోమను సేనానులు లక్షా రెండు లక్షల సైన్యంతో ధైర్యం చాలక వెనుదిరిగిపోయారు.

## విజ్ఞతా పూర్వకమయిన సలహా

ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న దృష్టితో ప్రవక్తశ్రీ(స) తబూక్‌లో దాదాపు మూడు వారాలు బస చేసి ఆ దరిదాపుల్లోని చిన్న చిన్న సంస్థానాల్లాంటి రాజ్యాలతో సంపర్కం జరపాలని నిశ్చయించుకున్నారు. అప్పటికే ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థ, సైనిక బలం ఇత్యాది విషయాల ప్రాచుర్యం తెలిసిన ఆ సంస్థానాలు ఒక్కొక్కటే ప్రవక్తశ్రీ (స) వద్దకు వచ్చి ఇస్లామీయ రాజ్యానికి కప్పం కట్టి సామంతులుగా మెలగడానికి ఒప్పందాలు చేసుకోసాగాయి. వాటిలో దౌమతుల్ జన్దల్ క్రైస్తవ పరిపాలకుడు ఉకైదర్ బిన్ అబ్దుల్ మలిక్, అయిలా పరిపాలకుడు యొహన్నా (జాన్) బిన్ రూబా, మక్నా, జర్బా, అజ్‌రుహ్ పాలకుడు కూడా జిజ్‌యా చెల్లించి ఇస్లామీయ రాజ్యాధీనం అవడానికి అంగీకరిం చారు. వీరంతా రోమను పాలకులకు లోబడిన క్రైస్తవ రాజ్యాలు. ఈ విధంగా ఇస్లామీయ రాజ్య సరిహద్దులు నేరుగా రోమను సామ్రాజ్య సరిహద్దులతో కలిశాయి. లోగడ రోమను సామ్రాజ్యం అరబ్బు తెగలపైన చెలాయించిన పెత్తనం కాస్తా తగ్గుముఖం చూపసాగింది. అనేక సంస్థానాలు ఇస్లామీయ పాలనలో భాగంగా రూపొందాయి. ముస్లిములు రోమనులతో ఘర్షణకు లోనవ కుండానే, అరేబియా ప్రాంతాలపైన అధీనత సాధించడంలో సఫలీకృతులయ్యారు.

కైసరు పైవిధంగా నిమ్మళంగా మైదానం నుండి విముఖుడవటం ఇస్లామీయ యోధులకు నైతిక బలాన్ని చేకూర్చింది, వారి నైతిక సాహసాన్ని (Morale) ద్విగుణీకృతం చేసింది. ఆ తరుణంలో ఆయన (స) తన సలహామండలి సభ్యులతో సంప్రదించారు, ఇంకా ముందడుగు వేసి సిరియా సరిహద్దుల్లో ప్రవేశించడమా లేదా ఇంతటితో కేవలం ప్రాప్తమయిన సాఫల్యంతో, దాన్ని దృఢతరం చేసుకుని మదీనాకు మరలడమా? ఏది ఉచితం అని. దానికి మహనీయ ఉమర్ (ర) తన సలహా ఇలా వెలిబుచ్చారు:

> "దైవప్రవక్తా! నా సలహా ఏమిటంటే మేము ఈ ప్రయాణం ద్వారా అనేక రాజకీయ ప్రయోజనాలను సాధించాము. ఇంకా ఎన్నో సైనిక లక్ష్యాలనూ గడించాము. ఎందరో క్రైస్తవ నాయకులూ, పాలకులు ఒప్పందాలు చేసుకుని లొంగి పోయారు. మిగతా వారు భయవిహ్వాళురయిపోయారు. మేము వారి ఇంటి తలుపు తట్టి ఛాలెంజి చేశాము, వారు మార్కొనే సాహసం చేయలేకపోయారు. ప్రస్తుతం వాతావరణం అత్యంత కఠినం. శత్రువు మనకన్నా ఎన్నో రెట్లు బలోపేతుడు. ఈ ప్రాంతాల్లో ముస్లిమ్ సోదరులూ ఎవ్వరూ లేరు. అందువల్ల నేను చెప్పేది, ప్రస్తుతానికి మనవాళ్ళను వెనిక్కి మరిలే ఆదేశాలివ్వండి. రాబోయే సంవత్సరం, లేదా మరెప్పుడయినా దైవాదేశమయినప్పుడు మనం తిరిగి వచ్చి వీరి పని పడదాము."

ప్రవక్తశ్రీ(స) పరిస్థితుల్ని, జరిగిన సంఘటనల్నీ దృష్టిలో ఉంచు కుని మహనీయ ఉమర్ (ర) సలహాను సమ్మతించారు. ఇస్లామీయ యోధులకు వెనిక్కి మరిలే ఆదేశాలిచ్చారు. ముస్లిములు, తమపైకి విజృంభించడానికి ఆగ్రహంతో తుల తూగుతున్న వైరివీరుల్ని వారి వాకిట ఛాలెంజి చేసి, వారు మడిమ త్రిప్పేలా చేసి విజయవంతంగా మదీనాకు తిరుగు ప్రయాణం చేయ సంకల్పించారు.

## కాపట్యం తలపెట్టిన మరో కుట్ర

మదీనా నుండి తోడుగా వస్తున్న కపటుల వర్గం లోలోనే కుమిలి పోసాగింది; తాము తలచినట్లు రోమనుల చేతుల్లో ఇస్లామీయ యోధులు, ముఖ్యంగా ప్రవక్త మహనీయులు(స), బందీలయి ఇస్లామ్ దివిటీ చిరకాలానికి గాను ఆరిపోవడానికి బదులు విజయవంతమయి దేదీప్యమానంగా వెలుగొందడం చూసి సహించలేకపోయారు. తిరుగు ప్రయాణంలో ఓ చోట కొండలు, కనుమలు, గుట్టలు, లోయలు వచ్చే చోట, చీకటి పడగా అదను చూసి ప్రవక్తశ్రీ (స)ను కొండమీది నుంచి త్రోసి వేయాలని పూనుకున్నారు. ఆ సమాచారం ప్రవక్త మహనీయులకు తెలిసింది. ఆయన దారి మార్చి కుట్రదారుల పథకమంతా తారుమార య్యేలా ఆ చోటి నుంచి దాటి వచ్చేశారు. మరుసటి రోజు ఓ విధేయుడు ఈ వివరాలన్నీ తెలుసుకుని తనకు అనుమతినిస్తే ఆ కుట్రదారుల్ని అంతమొందిస్తానని ప్రవక్త సన్నిధి లోకి వస్తాడు. అయితే విశ్వకారుణ్యమూర్తి ఆ ఘడియ దాటి పోయింది కదా ఇక ప్రతీకారానికి తావులేదని సముదాయించారు.


*ఆధారం : 1) సీరతున్నబీ కామిల్, ఇబ్ను హిష్షామ్ : సం.2 : పు. 630, 635.*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3 : పు.378-381.*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.9 : పు.521-550.*

# బహిరంగ శత్రువు షైతాన్

- తస్నీమ్‌జహాన్ ఖాన్

**దైవధిక్కారి :** షైతాన్ ఆదం(అ)కు సాష్టాంగ పడకుండా దైవధిక్కారానికి పాల్పడ్డాడు. అందుకే మానవులకు కూడా దైవ ధిక్కారాన్ని ప్రేరేపిస్తూ ఉంటాడు. దైవాజ్ఞను ఉల్లంఘించేలా చేస్తాడు. అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యే కార్యాలు చేసేలా ప్రేరేపిస్తాడు. తన మాయమాటలతో అలసత్వం నేర్పుతాడు. చేసినన్ని తప్పులు, పాపాలు చేసేసి చివరకు తౌబా చేసుకోవచ్చులే అని మభ్యపెడ తాడు. హరాం ఆహారం, హరాం వ్యాపారాలు, హరాం బంధాలు, హరాం పనులను చెయ్యమని షైతాన్ ప్రేరేపిస్తాడు. చిన్న చిన్న పాపాలు చేసినవారికి నేను పాపిని, ఎలాగూ నరకంలోనే పోతాను, అలాంటప్పుడు మరిన్ని పాపాలు చేసినా నాకొచ్చే నష్టం ఏముందని అనేభావనలు కలిగించి మరెన్ని పాపాల రొంపిలో దింపుతాడు. నేను పాపిని, నాకు క్షమాభిక్ష దొరకదు, నేను నరకవాసిని అనే ఆలోచనలు కలిగించి దైవకారుణ్యం పట్ల నిరాశ కలగజేస్తాడు. మనిషి చేసే పాపాలను మనోహరమైనవిగా చేసి చూపుతాడు. సజ్జనులంటే కోపం, ద్వేషం కలుగజేస్తాడు. వారి మాటలు వినకుండా అడ్డుకుంటాడు.

**బహు దైవారాధనను ప్రేరేపిస్తాడు :** బహు దైవారాధనను, విగ్రహారాధనను ప్రేరేపించడంలో షైతాన్ ప్రధాన భూమికను పోషించాడు. చనిపోయిన మహాత్ముల విగ్రహాలను, పటాలను జ్ఞాపకార్థం ఉంచుకోమని మొదటి ఎత్తు వేశాడు. తర్వాతి తరాలకు మీ పెద్దలు వీరిని పూజించేవారని వదంతిని వ్యాపించి విగ్రహారాధన వైపు మళ్ళించాడు. దైవానికి సహవర్తులు కల్పించేలా చేశాడు. వివిధ రూపాల్లో షైతాన్ కనబడి ఆ రూపాలను పూజించేలా ప్రేరేపించాడు. నిజదైవాన్ని, దైవప్రవక్త బోధనలను విడిచి కట్టుకథలు, మిథ్యాదైవారాధన వైపు ప్రజలను మళ్ళించాడు.

అల్లాహ్ ఎంతటి ఘోరమైన పాపాన్నైనా క్షమిస్తాడు. కానీ ఆయనకు సహవర్తుల్ని కల్పించటం, ఆయన ఉనికిని నిరాకరించి స్థితిలోనే చనిపోయిన వారికి ఎన్నటికీ క్షమించడు.

**ఇతరులకు మొక్కమంటాడు :** అల్లాహ్‌ను విడిచి ఇతరులను మొక్కమని ప్రేరేపిస్తాడు. ఇతరులకు మొక్కులు చెల్లించుకోమని బోధిస్తాడు. ఆరాధన, మొక్కులు, ప్రార్థనలు అన్నీ అల్లాహ్‌కే చెయ్యాలి. ఇతరుల దరికి చేరి చేసిన ప్రార్థన, మొక్కు, ఆరాధన అంతా నిషిద్ధమైన కార్యం. కోరిన కోరికలన్నీ తీరాలని అడ్డదారులు తొక్కకూడదు. ఉద్యోగం, ప్రేమ, సంతానం, డబ్బు, ప్రమోషన్, హోదా వంటి వివిధ అంశాలను పొందేందుకు మిథ్యాదైవాల ముందు చెయ్యి చాచమని అక్కడ మొక్కగానే ఇక్కడ పని జరిగిపోతుందని నమ్మించి మోసం చేస్తాడు షైతాన్.

**షైతాన్‌కు భార్యాభర్తలు విడిపోవటం ఇష్టం :** జాబిర్(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు : 'ఇబ్లీస్ తన సింహాసనాన్ని నీటిపై వేసుకుని తర్వాత తన సైన్యాన్ని వ్యాపింపజేస్తాడు. ఎవరైతే ఎక్కువగా పీడించేవాడుంటాడో అతను అతని సామీప్యం పొందుతాడు. వారిలో ఒకడు వచ్చి 'నేను ఫలానా ఫలానా పని చేశాను' అంటాడు. అతను (షైతాన్) "నువ్వు ఏమీ చెయ్యలేదు లే' అంటాడు. తర్వాత వారిలో ఒకడు వచ్చి "నేను (ఎవరితో ఉన్నానో) వాడిని. వాడి భార్యతో విడిపోయేవరకు విడిచి పెట్టలేదు" అని అంటాడు. షైతాన్ అతన్ని తనకు దగ్గరగా తీసుకుని "నువ్వు అందరికంటే గొప్పవాడివి" అని అంటాడు. (సహీహ్ ముస్లిం)

అందుకే ఇళ్ళల్లో భార్యాభర్తల మధ్య చీటికి మాటికి గొడవలు జరుగుతుంటాయి. ఈ గొడవలే కొందరు విడాకులు తీసుకుని పోయేదాకా వదలవు. కొందరు చాలా చిన్న చిన్న విషయాలకే విడిపోతారు. మరికొందరు అకారణంగానే విడిపోతారు. వారెందుకు విడిపోయారో వారే వివరణ ఇవ్వలేకపోతారు. భార్యాభర్తల మధ్య అపారమైన ప్రేమ ఉన్నా కూడా విడిపోయి తర్వాత బాధపడతారు. ఇవన్నీ షైతాన్ ప్రేరణ వల్ల జరుగుతాయి. వాడు విడగొట్టే వరకు విడిచిపెట్టడు. అపోహలు, అనుమానాలు, అపార్థాలు, పెడార్థాలు అన్నింటినీ అస్త్రాలుగా ఉపయోగిస్తాడు. భార్యాభర్తలు విడిపోతే కుటుంబం విచ్ఛిన్నమవుతుంది.

**షైతాన్ శరీరంలో రక్తంలా తిరుగుతుంటాడు :** అపోహలు, అనుమానాలు, అపార్థాలు, వదంతులు పుట్టించడంలో షైతాన్ చాలా వేగంగా పనిచేస్తాడు. ఒకసారి రాత్రివేళ దైవప్రవక్త(స) తమ అర్ధాంగి సఫియా(రజి)ను వెంటబెట్టుకుని ఆమె ఇంటికి వెళ్తున్నారు.

దారిలో ఇద్దరు అన్సార్ పురుషులు ఎదురయ్యారు. దైవప్రవక్త(స) వారిని ఆపి 'నా వెంట ఉన్న స్త్రీ నా భార్య సఫియా' అని చెప్పారు. వారిద్దరూ ఈ మాట విని "దేవుడు పరిశుద్ధుడు! దైవప్రవక్తా! మీ విషయంలో కూడా ఎవరైనా అనుమానిస్తారా?" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) "షైతాన్ మనిషి శరీరంలో రక్తంలా తిరుగుతుంటాడు. వాడు మీ హృదయాల్లో కూడా దురాలోచన రేకెత్తిస్తాడేమోనని నేను భయపడ్డాను" అని అన్నారు. (అబూదావూద్)

ఎవరైనా అనుమానం పడకముందే వారికి వివరణ ఇచ్చేయటం ఉత్తమమైన విధానం. మనం కరెక్టుగానే ఉన్నాము కదా ఇతరులు ఏమనుకుంటే మనకేంటి? అనే ధోరణి వల్ల మీ ఇమేజ్ డ్యామేజ్ అయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రస్తుత కాలంలో మరీ ఘోరమైన వదంతులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడ్తున్నాయి. బ్రతికున్న వారిని సైతం చనిపోయారని, లేనిపోని రోగాలు అంటగట్టి రోడ్డున పడి అడుక్కుంటున్నారని ఫొటోలు మార్ఫింగ్ చేసి రకరకాలుగా రూమర్స్‌ను క్రియేట్ చేస్తున్నారు. ఇవన్నీ షైతాన్‌ను సంతోషపరిచే కార్యాలు.

మరో ఉల్లేఖనం ఇలా ఉంది : "స్త్రీల దగ్గరికి వారి భర్తలు లేనప్పుడు వెళ్ళకండి. ఎందుకంటే మీలో ప్రతి ఒక్కరి ఆంతర్యంలో షైతాన్ రక్తంలా ప్రవహిస్తున్నాడు." (ముస్లిం)

**మూడోవాడు షైతాన్ :** దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించిన మనిషి ఒంటరిగా ఉన్న (పర) స్త్రీ దగ్గరకు పోకూడదు. అలా పోయి నప్పుడు (వారిద్దరితోపాటు) మూడోవాడు షైతాన్ అవుతాడు. కనుక ఆ స్త్రీ తోడుగా ముహ్‌రిం పురుషుడు లేనంతవరకు పర పురుషుడు ఆమె దగ్గరకు పోకూడదు." (అహ్మద్)

**నాల్గవది షైతాన్ కోసమే :** జాబిర్(రజి) ఉల్లేఖనం : దైవప్రవక్త(స) ఉపదేశించారు : "(ఇంటిలో) పడక ఒకటి పురుషునికి, మరొకటి అతని భార్యకు, ఇంకొకటి అతిథి కోసం ఉంటుంది. నాల్గవది ఉంటే అది షైతాన్ కోసమే!" (ముస్లిం, మిష్కాత్). ఈ హదీసు వివరణలో ఇలా ఉంది : ఇంటిలో ఉండే పడకలు, ఫర్నీచర్, ఇత్యాది అవసర సామగ్రి అవసరం మేరకు ఉండాలి. కాని అలాకాక కేవలం డాబుసరి, డంబాచారం ప్రకటించుకోవడానికి సామగ్రిని అమితంగా పోగు చేసుకోవడం షైతాన్‌కు ప్రియమైన చర్య అన్న ధ్వని ఈ హదీసులో వినవస్తోంది. ఇది దైవానికి ఏమాత్రం ఇష్టంకాని వైఖరి. దుబారా ఖర్చు కూడా. పడకల సంఖ్యను, దానికి సంబంధించిన పరిమితిని తెలుపడం ఈ హదీసు ఉద్దేశ్యం కాదు. విలాస జీవితం, దుబారా ఖర్చులు చేసే తత్వం ఇత్యాది చెడుగులను నివారించడమే దీని ఉద్దేశ్యం.

ఖుర్ఆన్‌లో ఈ విధంగా హెచ్చరించడం జరిగింది : "వృధా ఖర్చులు చెయ్యకండి. వృధా ఖర్చుచేసేవారు షైతాన్ సోదరులు. షైతాన్ తన ప్రభువునకు కృతఘ్నుడు." (17: 27)

**షైతాన్ విషబాణాలు :** షైతాన్ స్త్రీ పురుషులను చూపుల ద్వారా ఆకర్షింపజేస్తాడు. పరాయి స్త్రీలను, పరాయి పురుషులను మళ్ళీమళ్ళీ చూసేలా ప్రేరేపిస్తాడు. దైవప్రవక్త(స) అలి(రజి)తో ఇలా అన్నారు : అలీ! (యాదృచ్ఛికంగా) ఒకసారి (పర స్త్రీపై) దృష్టి పడిన తర్వాత, రెండవసారి దృష్టి సారించకు. మొదటిసారి చూపునకు క్షమాపణ ఉంది. కాని రెండవసారి చూపునకు లేదు." (అబూదావూద్)

దైవప్రవక్త(స) హదీసె ఖుద్సీలో దైవం అన్నమాటలను ఇలా తెలిపారు : "షైతాన్ వదిలే విషబాణాలలో ఒకటి (మానవుని వాడి) చూపు. కనుక నాకు భయపడి అలాంటి చూపుల్ని మానుకునే మనిషికి నేను దృఢమైన విశ్వాస భాగ్యం ప్రసాదిస్తాను. దాని మాధుర్యం అతను తన మనసులో గ్రహిస్తాడు." (తబ్రాని)

అశ్లీల కార్యాలన్నీ మొదట చూపుల ప్రేరణ వల్లనే కలుగుతాయి. చూపులను కాపాడుకోమని స్త్రీ పురుషులిరువురినీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. కానీ షైతాన్ దుష్ప్రేరణల ద్వారా అల్లాహ్ ఆజ్ఞలను ధిక్కరించేలా చేస్తాడు. మనమున్న సమాజంలో, ప్రచార సాధనాల ద్వారా చూపులు పెడదారి పట్టే మార్గాలు పుష్కలంగా సర్వత్రా ఉన్నాయి. కాబట్టి జాగ్రత్తగా మసలుకోవాలి.

**కోపం కలిగిస్తాడు :** "తన కోపమే తనకు శత్రువు" అనే సామెత గుర్తుంది కదా... కోపంలో మనిషి విచక్షణా జ్ఞానం కోల్పోయి ఏది పడితే అది వాగుతాడు, ఎలా పడితే అలా ప్రవర్తిస్తాడు. బంధాలు బంధుత్వాలు, పరువు ప్రతిష్టలు అన్నీ వదిలిపోతాయి. అతి కోపం వల్ల చివరకు మనిషి ఒంటరివాడైపోతాడు. దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు : "కోపం షైతాన్ ప్రభావం వల్ల వస్తుంది. షైతాన్ అగ్ని నుంచి సృజించబడ్డాడు. నిప్పు నీటితోనే చల్లారుతుంది. అందుచేత మీరు కోపం వచ్చినప్పుడు వెంటనే వుజూ చెయ్యాలి." (అబూదావూద్). మరో హదీసులో దైవప్రవక్త(స) ఇలా బోధించారు : "నిలబడి ఉండగా కోపం వస్తే తక్షణం కూర్చోవాలి. ఈ ఉపాయం వల్ల కోపం పోతే సరేసరి, లేకపోతే వెంటనే పరుండాలి"

చాలామంది కోపం రాగానే ఇంట్లోని వస్తువులు పగలగొడతారు. అవి ఎంత ఖరీదైనవైనా సరే తమ కోపానికి హద్దులుండవు. ఇంటిని ధ్వంసం చేసేస్తారు. ఫోన్లు పగలగొడతారు. టీవీలు పగలగొడ్తారు, భార్యలను ఎముకలు విరిగేలా కొడ్తారు. పిల్లలను బాదుతారు.

కోపం వచ్చినప్పుడు దైవప్రవక్త(స) ఏం చెయ్యమన్నారు? మీరు దాన్ని ఎప్పుడైనా పాటించారా? షైతాన్ పట్టినట్టు పూనకంతో ఊగిపోవడం కాదు, కోపాన్ని అదుపు చేసుకోవడం అవసరం.



# నీటి యుద్ధాల కాలం రాబోతోంది

**భవిష్యత్తులో** యుద్ధాలు నీటి కోసం జరుగుతాయని, మూడవ ప్రపంచ యుద్ధం నీటికోసమే జరగొచ్చని చాలా మంది నిపుణులు హెచ్చరించారు. అనేక నదులు ప్రవహించే భారతదేశంలో నీటికి కరువొస్తుందా? గుక్కెడు తాగునీటి కోసం మైళ్ళకొద్ది నడిచే గ్రామీణ ప్రాంతాలు నేటికి కూడా ఉన్నాయన్నది మరిచిపోరాదు. నీటి వనరులు దేశంలో పుష్కలంగా ఉన్నప్పటికీ వాటర్ మేనేజిమెంట్ అనేది కనబడదు. జలసంపద అమూల్యమైనది. దాదాపు అరవై కోట్ల మంది ప్రజలు నీటి అవసరాల కోసం కేవలం రుతు పవనాలపై ఆధారపడే పరిస్థితి ఉంది. వానరాకడ ఎప్పుడో చెప్పలేని పరిస్థితి. రుతుపవనాలు ఆలస్యమైతే నీటి కష్టాలు ప్రారంభమవుతాయి. అయినా నీటివనరుల నిర్వహణ విషయంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. రుతుపవనాల విషయంలో ఖచ్చితంగా చెప్పడం ఎన్నడూ సాధ్యం కాదు. గ్లోబల్ వార్మింగ్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు మారిపోతున్నాయి.

ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి గురించి వార్తలు చదువుతున్నాం. కొన్ని నగరాల్లో ప్రభుత్వం నీటి సరఫరాకు రేషన్ విధించిన సంఘటనలు కూడా ఉన్నాయి. కొంతకాలం క్రితం దక్షిణాఫ్రికాలో రోజుకు పాతిక లీటర్ల రేషను లెక్కన ప్రజలకు నీటిని అందిస్తున్న వార్తలు కూడా చదివాం. మైళ్ళ దూరం నుంచి ట్రక్కుల్లో వాటర్ ట్యాంకర్లలో నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితులు న్నాయి. మన దేశంలోను కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులున్నాయి. దూరప్రాంతాల నుంచి నీటిని సరఫరా చేయవలసి వస్తోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం మనది. కాని ప్రపంచంలోని భూభాగంలో కేవలం 2.4 శాతం నేల మాత్రమే భౌగోళికంగా మనవద్ద ఉంది. ప్రపంచంలోని తాగు నీటిలో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉంది. దీన్ని బట్టి దేశంలో జనాభాకు అవసరమైనంత తాగు నీటి నిల్వలు ఉన్నాయో లేదో అర్ధం చేసుకోవచ్చు. దేశంలో దాదాపు సగం జనాభా నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంది. దేశంలో చాలా మంది కేవలం వ్యవసాయం ప్రధానంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. రుతుపవనాల వల్ల కురిసే వర్షాలే భూగర్భజలాలకు కూడా ఆధారం. వర్షాల వల్లనే 68 శాతం భూగర్భంలో నీటి నిల్వలు చేరుతున్నాయి. కాలువలు,

సాగునీరు, చెరువులు వగైరాల నుంచి భూమిలోకి నీరు ఇంకడం వల్ల భూగర్భంలో నీరు చేరడం అన్నది కేవలం 32 శాతమేనని తెలుస్తోంది.

దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుంటే భారతదేశంలో నీటి నిర్వహణ అన్నది చాలా లోపాలతో కూడుకున్నది. నీటి సమస్య విషయంలో దీర్ఘకాలిక పరిష్కారాల కోసం ప్రభుత్వాలు పని చేయడం లేదు. ఏదన్నా సమస్య వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో చేతులు దులుపుకుంటున్నాయి. నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడానికి వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం, నగరాల్లో వాటర్ వర్క్స్ అందరూ కలిసి సమన్వయంతో వ్యవహరించవలసి ఉంటుంది.

మరో ముఖ్యమైన విషయమేమంటే మనం రోజువారి నీటి వాడకంలో చాలా నీటిని వ్యర్థం చేస్తాం. ఇలా వ్యర్థమయ్యే నీరు 40 నుంచి 60 శాతం వరకు ఉంటుందని అంచనా. చాలా దేశాల్లో ఇలా నీటిని వ్యర్థంగా వాడడం జరగదు. నిజానికి భారత దేశం నీటివనరులు పుష్కలంగా ఉన్న దేశం. చాలా పెద్ద పెద్ద నదులు ఇక్కడ ఉన్నాయి. ఏటా సగటున 1170 మిల్లీమీటర్ల వర్షం కురుస్తుంది. ఏటా రిన్యూవబుల్ వాటర్ రిజర్వులు 1608 బిలియన్ క్యూబిక్ మీటర్లు. ప్రపంచంలో తాగునీటి రిజర్వుల్లో దాదాపు తొమ్మిదో వంతు ఇక్కడే ఉన్నాయి. భారతదేశంలో నీటిఎద్దడికి ముఖ్యమైన కారణం కేవలం నిర్వాహణ లోపమే. విచిత్రమేమంటే దేశంలో వరదలకు గురయ్యే ప్రాంతాల్లోనే ఆ తర్వాత నీటి ఎద్దడి కూడా ఉంటుంది. దేశంలో చిన్నా పెద్ద 4525 డ్యాములున్నాయి. అయినా దేశంలో తలసరి నీటి నిల్వ కేవలం 213 క్యూబిక్ మీటర్లు మాత్రమే. రష్యాలో ఇది 6,103 క్యూబిక్ మీటర్లు, ఆస్ట్రేలియాలో 4,733 క్యూబిక్ మీటర్లు, చైనాలో 1111 క్యూబిక్ మీటర్లు. అంటే మన ప్రభుత్వాలు ఆఫ్ సీజను కోసం నీటి నిల్వలకు సరయిన ఏర్పాట్లు చేయనే లేదని చెప్పాలి. నీటి నిర్వహణ విషయంలో ఇస్రాయిల్ చాలా ప్రగతి సాధించింది. డ్రిప్ ఇరిగేషన్, వ్యర్థజలాలను సాగుకు వాడడం, ఇండ్లల్లో ఉపయోగించిన నీటిలో 80 శాతం శుద్ధి చేసి వ్యవసాయానికి వాడడం జరుగుతోంది. అక్కడ సాగునీటిలో దాదాపు 50 శాతం ఇలా శుద్ధి చేసిన జలాలే.

ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు ప్రకారం 2030 నాటికి భారతదేశం 50 శాతం నీటికరువును ఎదుర్కోబోతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏటా మనకు 1100 బిలియన్ క్యూబిక్ మీటర్లు అవసరం. 2025 నాటికి 1200 బిలియన్ క్యూబిక్ మీటర్లు అవసరమవుతాయి. 1951 లెక్కల ప్రకారం దేశంలో సగటున ప్రతి మనిషికి ఏటా 5200 క్యూబిక్ మీటర్ల నీళ్ళు లభించేవి. అప్పుడు జనాభా 35 కోట్లు మాత్రమే. 2010 నాటికి జనాభా చాలా పెరిగింది. సగటున ప్రతి మనిషికి ఏటా లభించే నీళ్ళు 1600 క్యూబిక్ మీటర్లకు తగ్గిపోయాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం చూస్తే ఇది నీటి ఎద్దడిగానే భావించాలి. 2018లో దేశంలో సగటున ప్రతి ఒక్కరికి 1400 క్యూబిక్ మీటర్లు మాత్రమే. రాబోయే ఒకటి రెండు దశాబ్దాల్లో ఇది సగటును 1000 క్యూబిక్ మీటర్లకు పడిపోవచ్చన్న అనుమానాలున్నాయి. మరో ముఖ్యమైన విషయమేమంటే లభిస్తున్న నీటిలో చాలా భాగం వాడకానికి పనికివచ్చేది కాదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ చెబుతోంది. ప్రస్తుతం సగటున ప్రతిఒక్కరికి కేవలం 938 క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే వాడకానికి తగినది దొరుకుతోందని తెలుస్తోంది. భూమిపై నీటిలో కేవలం 2.5 శాతం నీరు మాత్రమే మంచినీరు. జలం జీవాధారం. అందుకే ఐక్యరాజ్య సమితి 2010 జులై 28వ తేదీన నీటిని పొందడం మానవ హక్కుగా తీర్మానించింది. సిటీబ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ విలియం బీటర్ నీటి ప్రాముఖ్యం గురించి రాస్తూ రానున్న కాలంలో చమురు, విలువైన లోహాల కన్నా నీరు విలువైందిగా మారిపోతుందన్నాడు.

ప్రపంచంలో పర్యావరణ మార్పుకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. చాలా దేశాలు క్లయిమేట్ ఛేంజ్ తట్టుకోడానికి సంసిద్ధమవుతున్నాయి. కాని మనం అలాంటి ప్రయత్నాలే చేస్తున్నట్లు కనబడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, పశువులకు నీటి ఎద్దడి సమస్య. బిందెడు నీళ్ళ కోసం మైళ్ళ కొద్దీ నడుస్తున్న మహిళలు, మరోవైపు పవర్ ప్లాంట్లకు తరలిపోతున్న నీరు వీటన్నింటి గురించి ఆలోచించేది ఎవరు? కొన్ని ప్రాంతాల్లో నేల, నీరు చవగ్గా పరిశ్రమలకు కట్టబెడుతున్న ప్రభుత్వాలు పునరాలోచంచవలసిన అవసరం ఉంది.

వర్షపాతం వల్ల లభించే నీటిలో 35 శాతం మాత్రమే నేడు ఉపయోగానికి వస్తుందన్న లెక్కలున్నాయి. వర్షపునీటిని నిల్వ ఉంచడానికి ఉపయోగపడే చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, సాంప్రదాయిక జలపరిరక్షణ విధానాలను ప్రోత్సహించడం, ప్రజలను కూడా నీటి నిర్వహణలో భాగస్వాములు చేయడం చాలా అవసరం. నీతి ఆయోగ్ జూన్ 14వ తేదీన ప్రచురించిన కాంపోజిట్ వాటర్ మేనేజిమెంట్ ఇండెక్స్ ప్రకారం భారతదేశం నేడు చరిత్రలో ఎన్నడూ లేనంత నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. దాదాపు 60 కోట్ల ప్రజలు అంటే దేశ జనాభాలో సగం మంది తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. తాగునీరు

అందుబాటులో లేనందువల్ల ఏటా రెండులక్షల మంది మరణిస్తున్నారు. ఇది సంక్షోభానికి ప్రారంభం మాత్రమే. పరిస్థితి మరింత దిగజారేలా ఉంది.

నీతి ఆయోగ్ నివేదికలో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు న్నాయి. రానున్న కాలంలో ఈ సంక్షోభం మరింత క్లిష్టసమస్యగా మారబోతోంది. భారతదేశంలో ప్రస్తుతమున్న నీటి డిమాండ్ 2030 నాటికి రెట్టింపవుతుంది. కోట్లాది ప్రజలు నీటి కరువులో చిక్కుకుంటారు. భవిష్యత్తులో ఈ పరిస్థితి తప్పనట్లు కనబడు తుంది కాబట్టి నీటి కరువు వల్ల మరణాల సంఖ్య కూడా పెరుగు తుంది. దీనివల్ల భారత స్థూల జాతీయోత్పత్తి 6 శాతం పడిపోతుంది.

ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం 2030 నాటికి దేశంలో పెట్రోలు, డీజిలు వాహనాలన్నింటి స్థానంలో పూర్తిగా ఎలక్ట్రిసిటీ ద్వారా నడిచే వాహనాలను ప్రవేశపెట్టే ఆలోచన ఉంది. దేశప్రజలంతా ఆన్ లైన్ సదుపాయాలు వాడుకునేలా చేయడం, మలేరియాను పూర్తిగా నిర్మూలించడం తదితర లక్ష్యాలున్నాయి. ఇవన్నీ 2030 నాటికి సాధించాలనుకుంటున్నాం.

నీటి కరువు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవితాన్ని అతలాకుతలం చేస్తోంది. కరువు రూపంలో అనేక మంది అమాయకులను పొట్టనపెట్టుకుంది. పట్టణ ప్రాంతాల్లోను నీటి కరువు ప్రధాన సమస్యగా మారుతోంది. ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు లతో సహా 21 నగరాల్లో 2020 నాటకి భూగర్భజలాలు అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉంది.

ప్రజలు చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ పెద్ద పెద్ద నగరాలకు వలస రావడం ఎక్కువవుతోంది. ఈ జనాభాకు తాగునీరు అందించడం ఈ నగరాలకు తలకు మించిన భారమవు తోంది. నగరాల్లో నీటి కరువు ఆర్థిక ప్రగతిని దెబ్బతీస్తుంది. దేశంలోని పెద్ద పెద్ద నగరాల్లో ఈ సూచనలు ఇప్పటికే కనబడు తున్నాయి. ఆకుపచ్చని పార్కులతో ఒకప్పుడు గార్డెన్ సిటీగా పేరుపొందిన బెంగుళూరు నగరం అనేక చెరువులు, సరస్సుల మధ్య ఉన్న నగరం . ఇక్కడ నీటి కరువుకు అవకాశమే లేదనుకునే పరిస్థితి. కాని నేడు ఆ పరిస్థితి మారింది. ట్రాఫిక్ జామ్ ల నగరంగా మారింది. ఎత్తయిన భవనాలు, చెరువుల్లో సరస్సుల్లో రసాయనిక కాలుష్యాలు, ఇతర కాలుష్యాలతో నిండిపోయింది. ఇలా దేశం లోని చాలా పట్టణాల్లో పరిస్థితి చేయిదాటిపోయింది. ప్రస్తుతం దేశంలోని గ్రామీణ ప్రాంతాల వైపు దృష్టి సారించివలసిన అవసరం ఉంది. అక్కడ జలవనరులను కాపాడుకోవాలి. ముఖ్యంగా భూగర్భ జలాలను కాపాడుకోవాలి. వ్యవసాయ రంగం కోసం భూగర్భజలాలను విపరీతంగా వాడే ధోరణిపై దృష్టిపెట్టాలి.

ప్రస్తుతం భారతదేశంలో నీటి అవసరాలకు 40 శాతానికన్నా ఎక్కువగా భూగర్భజలాలనే వాడుతున్నారు. విపరీతమైన వేగంతో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా భూగర్భజలాలను వాడుతున్నది భారతదేశమే. చైనా కన్నా రెట్టింపుగా భూగర్భజలాల వాడకం ఇక్కడ ఉంది. ఇండియ స్పెండ్స్ నివేదిక ప్రకారం చైనాతో పోల్చితే భారతదేశం 2010లో 250 క్యూబిక్ కిలోమీటర్ల భూగర్భజలాలను అధికంగా తోడింది. ఇది ప్రపంచంలో అత్యంత పెద్ద డ్యాములోని జలాల కన్నా 1.2 రెట్లు ఎక్కువ. ఇందులో 89 శాతం వ్యవసాయానికి వాడుతున్నాం.

## సుప్రీంకోర్టు చెప్పినా విద్వేష ప్రసంగాలు ఆగలేదు

విద్వేష ప్రసంగాలపై చర్యలు తీసుకోవడంలో ఎలాంటి సంకోచం చూపినా కోర్టు ధిక్కారం అవుతుందని న్యాయస్థానం చెప్పి వారం రోజులు గడవక ముందే మహారాష్ట్రలో ఇలాంటి విద్వేష కార్యక్రమాలు మూడు జరిగాయి. ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే కూడా పాల్గొన్నాడు. కనీసం రెండు ఇలాంటి కార్యక్రమాల్లో వక్తలు ఆయుధాలు ప్రయోగించడం గురించి మాట్లాడారు. ఏప్రిల్ 30న నాగపూర్ లో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో భజరంగ్ దళ్ త్రిశూలాలు పంచింది. జలగాంవ్‌లో అదే రోజు హిందూ జనజాగృతి సమితి ఇలాంటి కార్యక్రమమే నడిపింది. సకల్ హిందూ సమాజ్ కార్యక్రమంలో హిందువులందరు సాయుధులు కావాలన్నారు. కాని పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. థానేలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో విహెచ్పీ నేత సాధ్వి సరస్వతి, భరతానంద సరస్వతి, జైన ముని నీలేష్ చంద్ర మహరాజ్ విద్వేష మతతత్వ ప్రసంగాలు చేశారు. మతాన్ని కాపాడ్డం కోసం చంపడానికి చావడానికి హిందువులు సిద్ధమవ్వాలని సాధ్వి సరస్వతి తన ప్రసంగంలో మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ను చూసి ముస్లిములతో ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాలని నీలేష్ మహరాజ్ చెప్పాడు. గాంధీని గాడ్సే చంపి ఉండకపోతే దేశంలో హిందువులు మక్కా మదీనాల్లో ప్రార్థనలు చేయవలసి వచ్చేదని అన్నాడు. ఈ మాటలను ముఖ్యమంత్రి కుమారుడు వేదికపై కూర్చొని విన్నాడు. భరతానంద సరస్వతి యాభై రకాల జిహాదుల గురించి, కుట్రల గురించి చెప్పి రెచ్చగొట్టాడు. నాగపూర్, జలగాంవ్‌లలో త్రిశూల్ దీక్ష జరిగింది. అయినా పోలీసులు ఏమీ చేయలేదు.

ప్రపంచంలో వ్యర్థజలాలలను శుద్ధి చేసి మరలా వినియోగించు కోవడమొక్కటే నేడు నీటి సమస్యకు పరిష్కారం. ప్రపంచంలో వినియోగిస్తున్న నీరు ఆ తర్వాత వ్యర్థజలంగా, మురికినీరుగా మారిపోతోంది. ఆ నీటిని మళ్ళీ వినియోగించు కోగలిగితే నీటి సమస్యలు చాలా వరకు నివారించవచ్చు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి జారీ చేసిన నివేదికలో ఈ విషయాన్నే నొక్కి చెప్పడం జరిగింది.

రానున్న దశాబ్దాల్లో నీటి ఎద్దడి అత్యంత తీవ్రమైన సమస్యగా మారుతుందని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తెలిపింది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా 2030 నాటికి ప్రపంచంలో నీటికి డిమాండ్ చాలా పెరుగు తుందని, ప్రస్తుతం ఉన్న డిమాండ్ కన్నా 50 శాతం పెరగవచ్చని అంచనా వేసింది. పరిశ్రమలు, శక్తి ఉత్పాదన, దాదాపు వందకోట్లు పెరిగే జనాభా వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వేసిన అంచనాలివి. ఒకవైపు నీటికి డిమాండ్ పెరుగుతుంటే మరోవైపు నీటి వనరులు అంతరిస్తున్నాయి.

చాలా ప్రాంతాల్లో గ్లోబల్ వార్మింగ్ వల్ల కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. రానున్న శతాబ్దంలో భూమి ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితులన్నీ నిరాశజనకమైనవే. నీటిఎద్దడి మరింత పెరిగే సూచనలే కనబడుతున్నాయి.

ప్రతి సంవత్సరం దాదాపు 80 లక్షల మంది ప్రపంచవ్యాప్తంగా కలుషిత నీటి వల్ల, పారిశుద్ధ్యాన్ని పాటించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాల్లో ఏటా 35 లక్షల మంది నీటివల్ల వచ్చే వ్యాధులకు గురై మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లను, ఎయిడ్స్ వల్లను మరణిస్తున్న వారి సంఖ్య కన్నా ఇది ఎక్కువ.

పరిశ్రమల నుంచి, కర్మాగారాల నుంచి విడుదలయ్యే రసాయనాలు కలిసిన నీరు, అలాగే వ్యవసాయక్షేత్రాల నుంచి విడుదలయ్యే పురుగు మందులు వగైరా కలిసిన నీరు నదుల్లోను, సరస్సుల్లోను నీటిని కలుషితం చేస్తుంది. నదుల్లో, సరస్సుల్లో డెడ్ జోన్లు ఏర్పడుతున్నాయి. కోస్తా జలాలు కూడా వీటివల్ల కలుషితమవుతున్నాయి.

వ్యర్థజలాలలను శుద్ధి చేయకపోవడం వల్ల తలెత్తుతున్న అనేక సమస్యలను ఐక్యరాజ్యసమితి 200 పేజీల నివేదికలో కూలంకషంగా చర్చించింది. వ్యర్థజలాలు ఒక సమస్య కాదు, అవే సమస్యకు పరిష్కారమని, వాటిని శుద్ధి చేసి రీసైకిల్ చేయడం ద్వారా నీటి ఎద్దడిని నివారించవచ్చని పరిష్కార మార్గాలను సూచించింది.

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం చాలా ముఖ్యమైనది. వందకోట్ల భారతీయుల ఆకలిని తీర్చేది వ్యవసాయరంగమే. కాని భూగర్భజలాలు అంతరించిపోయేలా వ్యవసాయరంగం కొనసాగడం అన్నది దేశభవిష్యత్తుకు మంచిది కాదు. నీతిఆయోగ్ ప్రచురించిన వాటర్ మేనేజిమెంట్ ఇండెక్స్ ప్రకారం ఈ పరిస్థితిని మార్చడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇటీవల తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రాష్ట్రాలు ఈ పరిస్థితుల నుంచి పాఠాలు గ్రహించాయి. ప్రస్తుతం నీతిఆయోగ్ చేపట్టిన కాంపోజిట్ వాటర్ మేనేజిమెంట్ ఇండెక్సులో ఈ రాష్ట్రాలు అగ్రభాగాన ఉన్నాయి. కాని దేశంలోని 50 శాతం జనాభా ఉన్న బీహారు, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో నీటి నిర్వహణ, జల సంరక్షణకు సంబంధించి చాలా విచారకరమైన పరిస్థితి ఉంది. ఇలాంటి రాష్ట్రాల పట్ల మరింత శ్రద్ధ చూపించవలసిన అవసరం ఉంది. పరిస్థితి చేయిదాటక ముందే తగిన చర్యలు తీసుకోవడం అవసరం. ●


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

**లేదా**

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

రూహీ

# మార్కెట్ మాయాజాలంలో ముసలితనం



**వయసు** అనేది మన బుర్రలో ఉంటుందనుకుంటే పొరబాటు. ఇది నిజానికి సౌందర్య ఉత్పత్తులు, చర్మసౌందర్యం కాపాడుకునే ప్రయత్నాలు, డైట్ ప్లానుల గందరగోళం. ఇదంతా ఒక పెద్ద మార్కెటింగ్ మాయాజాలం

వయసును కనిపించనివ్వకుండా చేసే ప్రయత్నాలు మనదేశంలో కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అంటే మార్కెటు చాలా ఆలస్యంగా వచ్చింది. కాని వయసు విషయంలో అబద్ధాలు చెప్పడం మనకు అలవాటే కాబట్టి వయసు కనిపించకుండా చేసే ఉత్పత్తులు రాగానే ఆదరణ కూడా లభించింది.

వయసు కనిపించకుండా చేసే సాంప్రదాయిక పద్ధతులు మనకు చాలా ఉన్నాయి. రసాయన విధానాలు, తేనె, పసుపు, నానావిధ మూలికలను కలిపేసి వయసు పెరక్కుండా ఆపేసే ప్రయత్నాలు ఎప్పటి నుంచో చేస్తున్నాం. శతాబ్దాలుగా ఈ పద్ధతులు ఆచరణలో ఉన్నాయి. 2021 నాటికి ప్రపంచంలో యాంటీ ఏజియింగ్ మార్కెట్టు అంటే వయసు పెరక్కుండా చేసే ఉత్పత్తుల అమ్మకాలు 216 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా. వయసుపై మనిషి చేస్తున్న యుద్ధం ఇంట్లో తయారు చేసుకునే పసుపు, తేనె మిశ్రమాలకు పరిమితం కాదు. డైట్ ప్లానులకు పరిమితం కాదు. ఇప్పుడు యాంటీ ఏజియింగ్ అనేది బోటాక్స్, జువెడెర్మ్ వంటి మందులతో యవ్వనాన్ని మళ్ళీ సాధించుకునే స్థాయికి చేరుకుంది.

దీనంతటికి కారణం మార్కెట్ మాయాజాలం. కన్సూమరిజం. ఒక మనిషికి విలువ ఎలా లభిస్తుందో మార్కెట్ వాణిజ్య ప్రకటనలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఒక మహిళకు విలువ ఎలా లభిస్తుంది? ఎలా ఆత్మస్థయిర్యం పెరుగుతుందన్నది వాణిజ్య ప్రకటనలే చెబుతున్నాయి. మనిషికి సహజంగానే యవ్వనంతో ఉండాలని కోరిక ఉంటుంది. ఆ కోరికను మార్కెట్టు క్యాష్ చేసుకుంటోంది. అందువల్లనే వాణిజ్య ప్రకటనలు లేదా మార్కెట్ మాయాజాలంలో ఇరుక్కుపోతున్నాం. బోటాక్స్ ట్రీట్‌మెంట్ వంటి బాధాకరమైన, సైడ్ ఎఫెక్ట్స్ ఉన్న, అవమానకరమైన చికిత్సకు కూడా సిద్ధపడుతున్నారు.

పాశ్చాత్య దేశాల్లో ఇప్పుడు యాంటీ ఏజియింగ్ అనే పదం వాడుకలో లేదు. ఇప్పుడు పాశ్చాత్యదేశాల్లో వయసు కనిపించకుండా కాస్త దాచిపెట్టే, అంటే ముడుతలు కనిపించకుండా చేసే యాంటి రింకిల్, ప్రో ఏజ్, ఏజ్ పర్ ఫెక్ట్, స్లో ఏజ్ పద్ధతులు పాటిస్తున్నారు. మరో పదం వినిపిస్తోంది. అది రేడియంట్ స్కిన్ కేర్. అంటే ముడుతలు పడిన చర్మం ఉంటే అలాంటి వారు రేడియంట్‌గా కనిపించాలి. లేదా ఇంటి నుంచి బయటకు రాకూడదు.

గతంలో 50 సంవత్సరాలకు పైబడిన మహిళలు వయసు దాచిపెట్టడానికి యాంటీ ఏజ్ సొల్యూషన్లు కొనుక్కునేవారు. కాని

ఇప్పుడు ముప్పయి సంవత్సరాల యువతులు కూడా కొంటున్నట్లు తెలుస్తోంది. మనం సాధారణంగా వయసు అనేది మన మనసులో ఉంటుందని అంటుంటాం. ఇలాంటి ఆలోచనలు కూడా నిజానికి వయసు తక్కువగా ఉన్నట్లు కనబడాలన్న అభిప్రాయాన్నే బలపరుస్తుంటాయి.

## మన వయసు ఎంత ఉందో అంత కనబడితే తప్పేమిటి? వయసును ఎందుకు దాచుకోవాలి?

ఇదంతా మానసికతకు సంబంధించిన విషయం. ముసలితనం వచ్చిందన్న ఆలోచన మనసులో లేకపోయినా, ముసలివారిలా కనబడకపోయినా, ముసలివారని చెప్పుకోకపోయినా ఏం చేసినా వయసు మీద పడడం అనేది ఆగదు. కాబట్టి యాంటీ ఏజింగ్ మందులతో, సొల్యూషన్లతో వయసును కప్పిపుచ్చుకునే ప్రయత్నాల వల్ల, డైట్ ప్లానుల వల్ల సాధించేది ఏముంది? ఇలాంటి ప్రయత్నాలు మరి మితిమీరితే మనిషిలో ఆత్మవిశ్వాసమే అంతరిస్తుంది.

ఆధునిక కాలంలో మనిషి అనేక విషయాలను స్వీకరించడానికి అలవాటు పడుతున్నాడు. శరీరం, లైంగికత, వాంఛలు కోరికలు అన్నింటి విషయంలో వాస్తవాలను అంగీకరించడం జరుగుతోంది. కాని వయసు విషయంలో మాత్రం ఇంత విశాలంగా ఆలోచించడం లేదు. మీరంత వయసు ఉన్నట్లు కనబడడం లేదు అని ఎవరైనా అంటే పొంగిపోకుండా ఉండేవారు చాలా తక్కువ. అది గొప్ప పొగడ్తగా భావించడమే జరుగుతుంది.

తక్కువ వయసు కనిపించాలన్న కోరిక మహిళల్లో ఉండడం కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. సమాజంలో వారిని అందానికి ప్రతీకగా చూడడం ఎప్పటి నుంచో జరుగుతుంది కాబట్టి. కాని ఇప్పుడు పురుషులు కూడా అందంగా కనిపించాలన్న తాపత్రయంలో మునిగిపోయి కనబడుతున్నారు. దీనంతటికి కారణం మార్కెట్. పురుషులు కూడా పోటీ పడడంతో ఇప్పుడు కాస్మటిక్ పరిశ్రమ మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్థిల్లుతోంది.

ఇప్పుడు ఎటు చూసినా యంగ్ బ్లడ్ అన్నదే వినిపిస్తుంది. యువరక్తం కావాలి. యువకులు రావాలి. ప్రతిరంగంలో యువకులకే అవకాశాలు దక్కాలన్న నినాదాలు, ఆలోచనలు కూడా వయసును దాచిపెట్టే ధోరణికి కారణమవుతున్నాయి. యంగ్ ఇండియాలో విజయాలు సాధించాలంటే యంగ్‌గా కనబడాలి. లేకపోతే మార్గదర్శక్ పాత్రలకు పరిమితమైపోతామన్న భయం కూడా చాలా మందిలో ఉంది.

యువకులను ప్రోత్సహించడం ఎంత అవసరమో, అనుభవాన్ని గౌరవించడమూ అంతే అవసరం. వయసు మీద పడడం అన్నది ప్రతిభకు వ్యతిరేకం కాదు. వయసును గౌరవించడం ప్రతి మనిషి తన నుంచే ప్రారంభించాలి. తన వయసును తానే గౌరవించనట్లయితే బయటివారు గౌరవించడం సాధ్యం కాదు.

బొటాక్స్ వంటి ట్రీట్మెంట్లు తీసుకున్న చాలా మందిలో సైడ్ ఎఫెక్ట్ వల్ల తీవ్రమైన ఇబ్బందులు తలెత్తాయి. అలాగే హెయిర్ రిమూవల్ ట్రీట్మెంట్ల వల్ల కూడా ఇబ్బందుల పాలయినవారున్నారు. చర్మసౌందర్యానికి వాడే అనేక లోషన్ల వల్ల వచ్చే ఎలర్జీలు ఇతర సమస్యల బారిన పడిన వారున్నారు.

2035 నాటికి భారతదేశంలో కాస్మటిక్ పరిశ్రమ 35 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఎందుకంటే టీనేజర్లలో కాస్మటిక్స్ వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం కాస్మెటిక్ మార్కెట్ సైజు 6.5 బిలియన్ డాలర్లు. మరోవైపు హెర్బల్ కాస్మటిక్స్ పేరిట వస్తున్న ఉత్పత్తులు వేరే ఉన్నాయి. యువతరంలో 68 శాతం కాస్మటిక్స్ వాడి అందంగా కనిపించడం వల్ల ఆత్మస్థయిర్యం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నట్లు ఒక సర్వే చెప్పింది. గత ఐదేళ్ళ కాలంలో భారత పురుషులు కాస్మటిక్స్ కొనడం 42 శాతం పెరిగింది.

అందంగా కనిపించాలి. వయసు తెలియనివ్వరాదు అనే అభిప్రాయం చాలా బలంగా ఉంది. ఇది ఒక బలహీనత. ఈ బలహీనత మార్కెటుకు వరంగా మారింది.

## కలెక్టర్ పై ఫైరయిన జాతీయ మైనారిటీ కమీషన్ సభ్యులు

జాతీయ మైనారిటీ కమీషన్ సభ్యులు షహజాదీ ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, పోలీసు కమీషనర్ విష్ణు యస్. వారియర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేటులో మైనారిటీ సంక్షేమం రివ్యూ మీటింగ్‌లో వారిద్దరు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. కలెక్టరును తక్షణం పిలవాలని అదనపు కలెక్టరుకు చెప్పారు. సమావేశానికి గైరుహాజరైన కలెక్టరు, పోలీసు కమీషనర్లపై ఆమె కేంద్ర హెూం డిపార్టుమెంటుకు ఫిర్యాదు చేయాలని కూడా నిర్ణయించుకున్నారు. ఈ సంఘటన గురించి తెలిసిన తర్వాత ముస్లిం మహిళా సంఘాలు కలెక్టరు దిష్టిబొమ్మను దహనం చేశారు. నేషనల్ మైనారిటీ కమీషన్ పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆగ్రహించారు.



# ఔషధ రంగం ప్రక్షాళన అవసరమా!

**డాక్టర్ ఎన్.ఖలీల్**

**ఒంట్లో** నలతగా ఉండటం మొదలుకొని ఎలాంటి అనారోగ్య సమస్యలొచ్చినా వైద్యుణ్ణి సంప్రదించటం, తగిన మందు వాడి ఉపశమనం పొందటం సర్వసాధారణం. కానీ 'కొండ నాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడిన చందాన' ఔషధాలుంటే జనం ప్రాణాలు గాల్లో దీపంగా మిగిలిపోయినట్టే. ఔషధ సంస్థలన్నిటినీ అనలేంగానీ కొన్ని సంస్థలు అందరి కళ్లూ కప్పి నాసిరకం ఔషధాల ఎగుమతులతో లాభాలు గడించేందుకు తహతహలాడుతున్న తీరువల్ల మన దేశం పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటున్నాయి.

ఈ విషయంలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వం సంకల్పించటం సంతోషించదగ్గ విషయం. ఇకపై ఉత్పత్తుల తయారీ ప్రక్రియలో మంచి విధానాలు (జీఎంపీ) పాటిస్తున్నట్టు ధ్రువపడితేనే ఆ ఉత్పత్తులను విడుదల చేయటానికి అంగీకరించాలనీ, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయాలనీ కేంద్రం నిర్ణయించింది. ఫార్మా ఉత్పత్తుల్లో మన దేశం విశ్వగురు అయిందని రెండు నెలల క్రితం కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి భగవత్ కూబా ఘనంగా ప్రకటించారు.

కానీ ఇక్కడినుంచి ఎగుమతవుతున్న ఔషధాల వాడకంవల్ల పదుల కొద్దీ మంది మృత్యువాత పడిన ఉదంతాలు ఆ ఘనతను కాస్తా హరిస్తున్నాయి. నిరుడు ఆఫ్రికా ఖండ దేశం గాంబియాలో దగ్గు మందు సేవించి 70 మంది పసిపిల్లలు మరణించగా, ఉజ్బెకిస్తాన్‌లో 19 మంది పిల్లలు చనిపోయారు. భారత్ నుంచి వచ్చిన కొన్ని ఔషధాల ప్రమాణాలు సక్రమంగా లేవని అమెరికా కూడా ప్రకటించింది. ఔషధాల్లో మోతాదుకు మించి రసాయనాలున్నాయని కొన్నిసార్లు, నిర్దేశిత ప్రమాణాల్లో లేవని కొన్నిసార్లు ఫిర్యాదు లొస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో పంపిన ఔషధాలు పంపినట్టు వెనక్కొస్తున్నాయి. నిజానికి  గాంబియాకు ఎగుమతయిన దగ్గు మందు మన దేశంలో విక్రయానికి పనికిరాదని నిషేధించారు! అయినా అది నిరాటంకంగా గాంబియాకు చేరుకుంది. వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపమే ఈ దుఃస్థితికి కారణం. దీన్ని ఎంత త్వరగా సరిదిద్దితే అంత మంచిది.

ఔషధాల్లో వినియోగించే ముడి పదార్థాలు ప్రామాణికమైనవి అవునో కాదో, అవి నిర్దేశించిన పాళ్లలో ఉన్నాయో లేదో తనిఖీ చేయటం, రోగంనుంచి ఉపశమనమిస్తుందని చేసిన ప్రకటనకు అనుగుణంగా ఆ ఉత్పత్తి ఉందో లేదో నిర్ధారించటం నియంత్రణ వ్యవస్థల పని. అలాంటి సంస్థలు మన దేశంలో 38 వరకూ ఉన్నాయి. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ)తో పాటు రాష్ట్రాల్లో పలుచోట్ల ఔషధ పరీక్ష కేంద్రాలు (సీడీఎల్) ఉన్నాయి. కానీ ఏదీ సక్రమంగా అమలు కావటం లేదని పలుమార్లు రుజువైంది.

గాంబియాలోనూ, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్‌లోనూ పసివాళ్ల ప్రాణాలు తీసిన దగ్గు, జలుబు మందులను హరియాణాలోని మైడెన్ ఔషధ సంస్థ ఉత్పత్తి చేసింది. ఈ సంస్థ తరచు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. తమ ఫ్యాక్టరీకి ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఉందని తన వెబ్‌సైట్‌లో ఆ సంస్థ

ఘనంగా ప్రకటించుకున్నా అదంతా ఉత్తదేనని తేలింది. అయినా ఏ నియంత్రణ విభాగం ఆ ఔషధ సంస్థపై చర్య తీసుకోలేక పోయింది. ఇప్పుడు కొత్తగా అమల్లోకి తెస్తామంటున్న జీఎంపీ అయినా సక్రమంగా అమలు చేయగలిగితే మంచిదే.

ఉత్పాదక ప్రక్రియ సక్రమంగా లేకపోతే ఆ ఉత్పత్తులు కాస్తా కొద్ది రోజుల్లోనే దెబ్బతింటాయి. ఔషధాలు రోగం తగ్గించక పోయినా ఎంతోకొంత సరిపెట్టుకోవచ్చుగానీ ప్రాణాలే తీస్తే?! అసలే పౌష్టికాహార లోపం, వాతావరణ కాలుష్యం, విషాహారం తదితరాలు జనం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. చివరకు ఔషధాలు సైతం ఈ జాబితాలో చేరితే ఇక చెప్పేదేముంది?

వాస్తవానికి ఎగుమతి చేసే ఔషధాలకు జీఎంపీ విధానం ఎప్పటి నుంచో అమలులో ఉంది. కానీ దాన్ని అమలు చేయటంలోనే అడుగడుగునా నిర్లక్ష్యం కనబడుతోంది. ఔషధాలు ఎగుమతి చేయ దల్చుకున్న ప్రతి దేశమూ తమ ఔషధ సంస్థలు నిర్దిష్టమైన ప్రమాణాలు అమలు చేస్తున్నట్టు నిర్ధారించుకోవాలని గాంబియా విషాద ఉదంతం తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ నాలుగు నెలల క్రితం తెలిపింది. ఇందుకోసం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది.

ముడి పదార్థాల నాణ్యత మొదలు కొని కర్మాగారంలోని పరిసరాలు, యంత్రాలు, సిబ్బంది పాటించే పరిశుభ్రత వరకూ సమస్తం సరిగా ఉన్నాయో లేదో చూడటం ఈ మార్గదర్శకాల సారాంశం. ఉత్పత్తి ప్రక్రియలోని ప్రతి దశలోనూ పాటించే విధానాలను నమోదు చేసేందుకు అవసరమైన నమూనాను ఎవరికి వారు రూపొందించుకోవాలనీ, పకడ్బందీ తనిఖీలతో ఇవన్నీ సక్రమంగా అమలయ్యేలా ఎప్పటికప్పుడు చూడాలనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది.

కేంద్రం ప్రకటించబోయే జీఎంపీ ఇకపై మన దేశంలో విక్రయించే ఔషధాలకు కూడా వర్తిస్తుందంటున్నారు. మంచిదే. అయితే ఎగుమతయ్యే ఔషధాల విషయంలో చూపిన అలసత్వమే ఇక్కడా కనబడితే అనుకున్న లక్ష్యం నెరవేరదు. కర్మాగారం దాటి బయటికొచ్చే ప్రతి ఔషధమూ అత్యంత ప్రామాణికమైనదన్న విశ్వాసం రోగుల్లో కలగాలి. ఔషధాల తనిఖీ విధానంలో మార్పులు తెస్తే తప్ప దీన్ని సాధించటం కష్టం.

మన దేశంలో ఔషధ తయారీ సంస్థలు దాదాపు 30,000 వరకూ ఉన్నాయి. వీటిని సక్రమంగా తనిఖీ చేయాలంటే ఇప్పుడున్న సిబ్బంది ఏమాత్రం సరిపోరు. కనుక కొత్త నియామకాలపై కూడా దృష్టి పెట్టాలి. అలాగే చాలా ఫార్మా సంస్థలు తమ ఉత్పత్తుల ప్రయోగ ఫలితాల వివరాలను బహిరంగపరచటం లేదు. ఏమాత్రం పారదర్శకత పాటించని ఇలాంటి ధోరణులే కొంప ముంచుతున్నాయి. ఔషధ రంగాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తేనే ఈ పరిస్థితి మారుతుంది.

# కర్నాటకలో కాంగ్రెస్ భారీ విజయం

**దేశ**వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజారిటీ సాధించింది. ఏకంగా 136 నియోజక వర్గాల్లో జయకేతనం ఎగురవేసింది. బీజేపీ 64 స్థానాల్లో గెలుపొందింది. ఇక కింగ్ మేకర్‌గా మారుతుందని అంచనా వేసిన జేడీఎస్ కేవలం 20 స్థానాలకే పరిమితమైంది. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందించారు. "కర్ణాటక ప్రజలు 'ది కేరళ స్టోరీ'ని తిప్పికొట్టారని చెప్పారు. ఇప్పుడు దక్షిణభారతం 'బీజేపీ ముక్త్' అని చత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ భాఘెల్ వ్యాఖ్యానించారు. కర్నాటకలో గెలవడానికి బీజేపీ నేతలు మతతత్వాన్ని ఎంత రెచ్చగొట్టాలని చూసిన ఫలితాలు లభించలేదు. మోదీ కర్ణాటక ఎన్నికల్లో 19 ర్యాలీలు, 6 రోడ్ షోల్లో పాల్గొన్నారు. అయినా బీజేపీకి ఓటమి తప్పలేదు. అమిత్ షా 16 ర్యాలీలు, 15 రోడ్ షోల్లో పాల్గొన్నారు. జేపీ నడ్డా 10 ర్యాలీలు, 16 రోడ్ షోల్లో పాల్గొని ప్రచారం చేశారు. ఇంతగా కష్టపడ్డప్పటికీ ఫలితం దక్కలేదు. హిజాబ్ నిషేధం, హలాల్ వివాదం, టిప్పుసుల్తాన్ వివాదం, లవ్ జిహాద్ గగ్గోలు, కేరళ స్టోరీపై రాజకీయాలు, అజాన్‌పై ఆంక్షలు, రిజర్వేషన్లను తొలగించడం వగైరా మతతత్వ రాజకీయాల జిమ్మిక్కులకు కన్నడ ప్రజలు లొంగలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల ఎన్నికల్లో ఈ ప్రభావం పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ఫలితాలు సాధిస్తున్నట్లు తెలుస్తోంది. 2018 ఎన్నికల్లో 104 స్థానాలు సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న బీజేపీ ఇప్పుడు 38 స్థానాలు కోల్పోయింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం 136 స్థానాలు గెల్చుకుని 45 స్థానాలు అదనంగా సాధించింది. బీజేపీ ప్రభుత్వ అవినీతి, మత తత్వ విధానాలను ప్రజలు ఏవగించుకున్నారు. కర్నాటకలో ముస్లింలు దాదాపు 13 శాతం ఉన్నారు. హిజాబ్ వివాదం, రిజర్వేషన్లు రద్దు చేయడం వంటి వివాదాల నేపథ్యంలో ఈ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కేవలం 9 మంది ముస్లిములు మాత్రమే ఇప్పుడు కర్నాటక అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. గత అసెంబ్లీలో ముస్లిముల సంఖ్య కేవలం 7 మాత్రమే. కర్నాటక విధానసభలో మొత్తం సభ్యుల సంఖ్య 224.




## ముస్లిం మహిళపై దాడి చేసిన ఎస్ఐ

ముస్లిం మహిళపై ఒక యస్సై దాడిచేసిన సంఘటన గురించి తెలంగాణ మైనారిటీ కమీషన్ జగిత్యాల పోలీసు సూపరిండెంటు నుంచి వివరణ కోరింది. జగిత్యాలకు చెందిన షేక్ ఫరిహా అనే అమ్మాయి తన తల్లితో కలిసి బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు మరో మహిళతో వాగ్వాదం జరిగింది. ఆ మహిళ జగిత్యాల రూరల్ సబ్ ఇనస్పెక్టర్ భార్యగా తర్వాత తెలిసింది. ఫరిహా ఏం జరిగిందో వివరించింది. తాను తన తల్లి రజియా బేగంతో కలిసి బస్సులో వస్తున్నప్పుడు ఒక మహిళ వచ్చి తమ సీటులో పక్కకు జరిగి కూర్చోని ఖాళీ చేయమని చెప్పింది, బస్సులో చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి ఎక్కడైనా కూర్చోమని ఫరిహా చెప్పింది. కండక్టరు కూడా చాలా సీట్లు ఉన్నాయి ఎక్కడైనా కూర్చోమని చెప్పాడు. కాని ఆ మహిళ గట్టిగా అరుస్తూ తిట్టడం ప్రారంభించింది. తర్వాత సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కానిస్టేబుళ్ళతో బస్సులోకి ఎక్కి ఫరిహాను చావబాదినట్లు తెలుస్తోంది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు ఆదేశించారు. అనిల్‌ను విధుల నుంచి తప్పించి జిల్లా హెడ్ క్వార్టర్‌కు పంపించేశారు. మరోవైపు ఈ సంఘటనకు హిందూ ముస్లిం మతం రంగు పులమడానికి బీజేపీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు.

## హజ్ యాత్రకుల చార్జీలపై తెలుగుదేశం వైయస్సార్ సిపీల మధ్య వివాదం

విజయవాడ నుంచి హజ్ యాత్రికులు చెల్లించవలసిన మొత్తం విషయమై కేంద్ర హజ్ కమిటీ సర్క్యులర్ జారీ చేసింది. ఇప్పుడు ఈ సర్క్యులర్ తెలుగుదేశం వైయస్సార్ సిపీ మధ్య వివాదానికి కారణమయ్యింది. విజయవాడ ఎయిర్ పోర్టు నుంచి వెళుతున్న హజ్ యాత్రికులు 3,88, 580 రూపాయలు చెల్లించాలని హజ్ కమిటీ సర్క్యులర్ పేర్కొంది. హైదరాబాదు నుంచి వెళుతున్న హజ్ యాత్రికులు కేవలం 3,05,173 రూపాయలు చెల్లించాలి. బెంగుళూరు నుంచి వెళుతున్న వారు 3.03,921 రూపాయలు చెల్లించాలి. కేంద్ర మైనారిటీ శాఖ క్రింద కేంద్ర హజ్ కమిటీ పనిచేస్తుంది. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి వెళుతున్న ప్రయాణీకులు ఇంత ఎక్కువ మొత్తం ఎందుకు చెల్లించాలని తెలుగు దేశం నేతలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు 83,407 రూపాయలు ఎక్కువ చెల్లించవలసి వస్తోంది. విజయవాడ నుంచి హైదరాబాదుకు విమాన టిక్కెట్టు 6వేలకు మించదు. రెండు నగరాల మధ్య దూరం కేవలం 250 కి.మీ. అయినా విజయవాడ నుంచి వెళుతున్న ప్రయాణీకుల నుంచి భారీగా వసూలు చేయడాన్ని ముస్లిం సంఘాలు కూడా ప్రశ్నిస్తున్నాయి. మాజీ స్పీకర్ ఎం.ఏ.షరీఫ్‌తో పాటు పలువురు తెలుగుదేశం నేతలు తీవ్రంగా ఖండిస్తూ స్టేటెమెంట్లు ఇచ్చారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ మాట్లాడుతూ ఆం.ప్ర.హజ్ కమిటీ వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆం.ప్ర.హజ్ కమిటీ తగిన విధంగా ప్రతిపాదనలు పంపి ఉన్నట్లయితే కేంద్ర హజ్ కమిటీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం జరిగేది కాదని అన్నారు. అయితే ఈ విషయంలో ఆం.ప్ర.హజ్ కమిటీకి ఎలాంటి ప్రమేయం లేదని ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. ఆం.ప్ర.హజ్ యాత్రికుల డిమాండ్లను తాము కేంద్ర హజ్ కమిటీకి పంపిస్తున్నామని చెప్పారు.

## మణిపూర్ హింసాకాండ కన్నా కేరళ స్టోరీ వార్తకే ప్రాముఖ్యం ఎక్కువ : న్యూస్ చానళ్ళ వైఖరిపై విమర్శల వెల్లువ

మణిపూర్ హింసాకాండలో 54 మంది మరణించారు. అయినా మన న్యూస్ చానళ్ళలో ఈ వార్త అంత ప్రముఖంగా కనిపించడం లేదు. ఎందుకంటే ఇంతకన్నా ముఖ్యమైన వార్తలు టీవీ చానళ్ళకు ఉన్నాయి. ఉదాహరణకు కర్నాటకలో ప్రధాని మోడీ రోడ్ షోలు, కేరళస్టోరీ చర్చలు, ఈ సినిమాపై నిషేధం విధించిన రాష్ట్రాల గురించి చర్చలు వీటికి ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. అలాగే ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల సమస్య కన్నా ముఖ్యమైన సమస్య గుడ్డు అనే ఒక ముస్లిం రౌడీ ఎక్కడ ఎప్పుడు కనిపించాడన్నది చాలా ముఖ్యమైన వార్త. ఒకవైపు కర్నాటకలో పోలింగ్ జరుగుతున్నప్పుడే రాజస్థాన్ లోని నాథ్ ద్వారాలో ప్రధాని ప్రసంగించారు. కాంగ్రెసు ఎలాంటి విలనో చెప్పారు. టీవీ చానళ్ళు చక్కగా చూపించాయి. కర్నాటకలో పోలింగ్ జరుగుతున్నప్పటికీ ఈ ప్రసారాలు జరిగాయి. ఇలాంటి చాలా వార్తలు చాలా ముఖ్యమైనవిగా టీవీలకు కనిపిస్తున్నాయి కాని మణిపూర్ హింసాకాండ అంత ముఖ్యమైనదిగా కనిపించలేదు. అప్పుడప్పుడు నామకార్థం మణిపూర్ గురించి కూడా చూపిస్తూ వచ్చాయి. ప్రైం టైం డిబేటుల్లో కేరళస్టోరీపై రచ్చ మామూలే. అత్యంత విషాదకరమైన సంఘటనలు మణిపూర్ లో జరుగుతున్నప్పుడు వాటికి ప్రాముఖ్యం ఇవ్వకుండా కేవలం కేరళ స్టోరీ గురించి మాట్లాడుతున్న టీవీ చానళ్ళ ప్రాముఖ్యతలెలాంటివో స్పష్టంగా తెలుస్తూనే ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## జైలు నుంచి ఇంటికి చేరిన ఇమ్రాన్

పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ జైలు నుంచి ఇంటికి చేరుకున్నాడు. ఆయన అరెస్టు అయిన తర్వాత దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. అవినీతి ఆరోపణలపై ఆయన్ను అరెస్టు చేశారు. చివరకు కోర్టు నుంచి ఆయనకు బెయిలు లభించింది. ఆయన లాహోరులోని తన ఇంటికి చేరుకున్నాడు. జైలు నుంచి ఇంటికి వెళుతున్నప్పుడే ఇమ్రాన్‌ఖాన్ తన ఒక వీడియో జారీ చేశాడు. ఇస్లామాబాద్ పోలీసులు తనను ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నించారని ఆరోపించాడు. ఇమ్రాన్ ఖాన్ అరెస్టు చట్టవిరుద్ధమని కోర్టు ప్రకటించింది. కోర్టు ఉత్తర్వు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ అయ్యింది. పాకిస్తాన్ సైన్యం ఇమ్రాన్ ఖాన్‌ను విమర్శించిన కొద్ది సేపటికే ఆయన్ను అరెస్టు చేశారన్నది కూడా గమనించాలి. తనపై సైన్యం హత్యాయత్నం చేసిందని కూడా ఆయన ఆరోపించాడు. ఆయన అరెస్టు తర్వాత దేశమంతా నిరసనలు పెల్లుబికాయి. వేలాది మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ అల్లర్లలో దాదాపు తొమ్మిది మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అయితే ఇమ్రాన్ ఖాన్‌ను మళ్ళీ అరెస్టు చేస్తామంటు కొందరు మంత్రులు ప్రకటించడం గమనార్హం. దేశంలో దిగజారిన పరిస్థితికి సైనిక జనరల్ సయ్యద్ అసీమ్ మునీర్ కారకుడని కోర్టులోనే ఇమ్రాన్ ఖాన్ ఆరోపించాడు. సైన్యంలో ప్రజాస్వామ్యం లేదని అన్నాడు.

## ఇస్లాం స్వీకరించిన జిప్సీ కుబేరుడు

బ్రిటన్‌లో అత్యంత సంపన్నుడైన ఒక జిప్సీ కుమారుడు తాను ఇస్లాం స్వీకరించిన తర్వాత మానసిక శాంతి పొందినట్లు ప్రకటించాడు. దేశంలో అత్యంత ధనవంతుల్లో అల్ఫీ సీనియర్ ఒకరు. ఆయన కుమారుడు అల్ఫీ బెస్ట్ జూనియర్. ఒకసారి తన మిత్రులు నలుగురితో కలిసి హెలికాప్టరులో ఒక ఫైవ్ స్టార్ హోటలుకు వెళ్ళారు. కేవలం కాస్త తినడానికి అత్యంత ఖరీదైన హెలికాప్టరులో అత్యంత ఖరీదైన హోటలుకు వెళ్ళారు. అయితే అతని మిత్రుల్లో ఒకరి తల్లి ఇస్లాం స్వీకరిస్తున్నట్లు తెలిసింది. ఆమె ఇస్లాం స్వీకరణకు మస్జిదుకు వెళుతున్నందు వల్ల మిత్రులందరూ త్వరగా తిరిగి రావలసి వచ్చింది. మస్జిదులో ఆమె ఇస్లాం స్వీకరించడం చూసిన అల్ఫీ ఇంతకు ముందెన్నడూ అలాంటి ధార్మిక వాతావరణం చూడలేదు. ఏదో తనను చేరుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు అతనికి అనిపించింది. వ్యాపార రంగంలో అద్భుతమైన విజయాలు సాధించిన ఈ యువకుడు వెంటనే ఇస్లాం స్వీకరించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయం తన తండ్రికి నచ్చలేదని, కాని తన తల్లి తనను పూర్తిగా సమర్థించిందని చెప్పాడు. జిప్సీల్లో ఇస్లాం స్వీకరించింది తానొక్కడే అని చెప్పుకున్నాడు.

## టర్కీ ఎన్నికల్లో ఉర్దుగాన్ ను సవాలు చేస్తున్న కిలిక్దారోగ్లు

టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ప్రతిపక్ష నాయకుడు కమల్ కిలిక్‌దరోగ్లు కీలక ఎన్నికలకు ముందే తమ ప్రచారాన్ని ముగించారు. ప్రభుత్వ విధానాలపై దేశంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎన్నికల ప్రచారం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ఎర్డోగాన్, అతని జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీకి మే 15వ తేదీన జరగనున్న ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి. కిలిక్‌డరోగ్లు రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (CHP) నేతృత్వంలోని ప్రతిపక్షం దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరిస్తామని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని, మానవ హక్కుల పరిస్థితి మెరుగుపరుస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. ఓటర్ల బెదిరింపు ఆరోపణలు, మీడియాపై ఆంక్షలు, విపక్షాల గొంతులను అణిచివేయడం వంటి అనేక ఆరోపణలు వస్తున్నాయి. పౌర సమాజం, అంతర్జాతీయ సంస్థలు టర్కీలో ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని అంటున్నాయి. ఉర్దుగాన్ ఈ ప్రాంతంలో అత్యంత శక్తివంతమైన నాయకుడు. ఆయన పద్ధతులను మానవ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. కిలిక్‌డరోగ్లు ఎర్డోగాన్‌కు బలమైన పోటీగా చెప్పుకుంటున్నాడు. ఆర్థిక సంస్కరణలు చేస్తామంటున్నారు. నిరుద్యోగం తొలగిస్తానని హామీ ఇస్తున్నారు.

## రియల్ కేరళ స్టోరీ- ఖతర్‌లో హిందు డ్రైవర్‌ను కాపాడిన ముస్లిములు

ఖతర్‌లో దివేష్ లాల్ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఒక ప్రమాదం కారణంగా ఒక వ్యక్తి మరణించాడు. ఈ కేసులో అరెస్టయిన దివేష్ లాల్‌కు శిక్షపడింది. జనవరి 8వ తేదీన వాటర్ ట్యాంకర్ ను ఒక షాపు దగ్గర దివేష్ లాల్ పార్కు చేశాడు. ఆ ట్యాంకర్ వెనక్కు దొర్లి ఒక ఈజిప్టు వ్యక్తిని ఢీకొంది. అతను మరణించాడు. అక్కడి చట్టాల ప్రకారం దివేష్ లాల్ సుదీర్ఘ జైలు శిక్ష అనుభవించాలి లేదా హతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి విడుదల పొందాలి. దివేష్‌ను విడుదల చేయించడానికి ముస్లిం యూత్ లీగ్ విరాళాలు సేకరించడం ప్రారంభించింది. 46 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించవలసి ఉంది. ఖతర్‌లో ఉన్న కేరళకు చెందిన ఒక ముస్లిం వర్తకుడు 16 లక్షలు ఇచ్చారు. కేరళ ముస్లిం కల్చరల్ సెంటర్ 4 లక్షలు సేకరించింది. మిగిలిన 20 లక్షలు కూడా విరాళాల రూపంలో సేకరించారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఈ విరాళాల సేకరణకు ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. పేద కుటుంబానికి చెందిన దివేష్ ఖతర్‌లో పనిచేయడానికి వెళ్ళాడు. ఈ పేదవాడిని కాపాడ్డానికి ఇప్పుడు అక్కడ ప్రయత్నిస్తున్నది ముస్లిం పార్టీలు, సంస్థలు, వ్యక్తులే. ఇదే రియల్ కేరళ స్టోరీ.

# మరణం

**- పోలంకి విజయభాస్కర్**

**దేవుని** అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణ కాలం రాయబడి ఉంటుంది. అశాశ్వతమైన ఈ ప్రపంచంలో సృష్టికర్త పెట్టిన విశ్వాస పరీక్ష ముగిసిన తరువాత మనిషి మరణానికి చేరువవుతాడు.

“మీరెక్కడ ఉన్నా సరే, మృత్యువు మిమ్మల్ని కబళిస్తుంది. ఆఖరికి మీరు పటిష్టమైన కోటలలో ఉన్నా సరే (అది మిమ్మల్ని వదలదు)” (ఖుర్ఆన్ 4: 78)

చావంటే... మనమంతా భయంతో చిగురుటాకుల్లా వణికిపోతాం! మనిషికి చావు లేకుంటే ఎంత బాగుండో అనుకుంటాం. చావనేది దైవం మనకిచ్చిన శాపంగా భావిస్తాం. కాని నిజానికి ఆ దేవుడు మనకు చావునిచ్చి గొప్ప పుణ్యం కట్టుకున్నాడు. మనం వందేళ్ళ జీవితంలో ఎన్నో కష్టాలు, ఎంతో దుఃఖానికి ఇంకెంతో కన్నీళ్ళకు గురవుతాం.

మనం మన కుటుంబం సుఖంగా జీవించడానికో, వారసులకు డబ్బు కూడబెట్టడానికో లేదా ఇంకా దేనికోసమో ప్రతి నిమిషం టెన్షన్. వేదనను అనుభవిస్తుంటాం. వీటి మధ్య మన వందేళ్ళ జీవితాన్ని నెట్టుకు రావడానికే.. లేని ఓపికను తెచ్చుకుంటూ ముందుకు సాగుతుంటాం. ఒక్కోసారి ఈ కష్టాలూ, కన్నీళ్ళూ... భరించలేక ఆత్మహత్యలక్కూడా పాల్పడుతుంటారు.

**ఆత్మహత్య మహా పాతకం :** కొందరు ఇహలోక కష్టాలు భరించలేక.. ఆపదలకు తట్టుకోలేక చచ్చిపోతే బాగుంటుందని భావిస్తారు. మరికొందరు ఈ పాడు బ్రతుకు బతకడం కంటే తొందరగా చచ్చిపోవడమే మేలనుకుంటారు. కాని ఆత్మహత్య మహా పాతకం. కష్టాలు వచ్చిపడినప్పుడు కంగారు పడి చావును కోరుకోకూడదు.

దైవప్రవక్త(స) చావును కోరుకోవడాన్ని వారిస్తూ ఇలా ప్రవచించారు: “మీలో ఎవరూ ఆపదలకు భయపడి చావును కోరుకోకండి. గత్యంతరం లేని పరిస్థితిలో ‘దేవా! నా కోసం జీవితం ప్రయోజన కరంగా ఉన్నంతవరకు నన్ను జీవించి ఉండేలా చెయ్యి, నా కోసం మరణమే ప్రయోజనకరమైన విషయమయితే నాకు మరణం కలిగించు’ అని వేడుకోవాలి.” (బుఖారీ, ముస్లిం)

“మీలో ఎవరూ మరణాన్ని కోరుకోకూడదు. ఒకవేళ సజ్జనుడయితే మరిన్ని సత్కార్యాలు చేయవచ్చు. దుర్జనుడయితే అతను (పాపాలు మానేసి) దైవ ప్రసన్నతను కోరుకునే అవకాశం ఉంటుంది.” (మిష్కాత్)


ప్రతి క్షణం ఎన్నో ఒత్తిళ్ళను ఎదుర్కొంటూ ఉన్న జీవితాన్నే భారంగా నెట్టుకొచ్చే మనకు యుగ యుగాల పర్యంతం చావు లేకుంటే ఆ జీవితాన్ని భరించగలమా..?

తాత్కాలికమైన ఒడిదుడుకుల్ని చూసి బెంబేలెత్తిపోతున్న మనం శాశ్వతమైన ఆటుపోటులను తట్టుకుని ముందుకు సాగుతామా? ముమ్మాటికీ ఆ జీవితాన్ని భరించలేం!

వంద సంవత్సరాల జీవితంలో ఎదురయ్యే కష్టాలూ, కన్నీళ్ళకే సతమతమవుతున్న మనం యుగాల పర్యంతం మరణం లేకుండా ఎవరైనా మనకి వరమిస్తే.. పశువులకన్నా ఘోరంగా తయారవుతాం! మనకిక చావే లేదనుకుంటే ఎన్ని అరాచకాలకైనా, అకృత్యాలకైనా నిర్లజ్జగా పాల్పడతాం.

**మరణం ఎవరికి మంచిది? :** మరణం అంటే సహజంగా ఎవరికైనా భయమే. కాని దేవునిపై, ఆయన ప్రవక్త (స)పై దృఢమైన విశ్వాసం కలిగి ఉండి, వారి ఆజ్ఞలను పూర్తిగా పాటించే విశ్వాసి మృత్యువుకు భయపడడు.

తుదిగేటు



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**